
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

కర్నూలు

జిల్లా వార్తలు 5

శుక్రవారం 28 ఫిబ్రవరి 2025



## లా సెమిస్టర్ ఫలితాలు విడుదల

కర్నూలు అర్బన్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): లా 3, 5 సంవత్సరాల 1,3,5,7,9 సెమిస్టర్ పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయి. పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్లు గురువారం వీటిని విడుదల చేశారు. మరిన్ని వివరాలకు రాయలసీమ యూనివర్సిటీ వెబ్ సైట్‌లో చూసుకోవాలని తెలిపారు.

## ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు: ఆర్ఐవో

కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మార్చి 1 నుంచి జరిగే ఇంటర్మీడియట్ పరీక్షలకు ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు ఆర్ఐవో ఎస్‌వీఎస్ గురువయ్యశెట్టి వెల్లడించారు. గురువారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ... పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కేంద్రాల్లో పర్నీచర్లు, విద్యుత్, ఫ్యాన్లు, తాగునీరు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలను కల్పించామన్నారు. ఒక్క విద్యార్థి కూడా నేలపై కూర్చుని పరీక్ష రాయరాదని, ఎక్కడైనా పర్నీచర్ కొరత ఉంటే.. పరీక్ష నిర్వహకులపై చర్యలు తీసుకుంటామన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ఒక నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోనికి అనుమతించేది లేదన్నారు. పరీక్ష కేంద్రాలను డీవీఈవో పరమేశ్వరరెడ్డి, స్పెషల్ ఆఫీసర్ లాలెప్ప పర్యవేక్షిస్తారన్నారు. జిల్లాలో 7 సమస్యాత్మక కేంద్రాలు గుర్తించామని, ఫ్లయింగ్ స్క్వాడ్స్ మూడు, సిట్టింగ్ స్క్వాడ్స్ 6 బృందాలను ఏర్పాటు చేశామన్నారు. పరీక్ష కేంద్రాల్లో ఏమైనా సమస్యలు వస్తే జిల్లా కంట్రోల్ రూమ్ నెం.08518-222047ను సంప్రదించాలన్నారు.

### ఫొటోస్టాట్, ఇంటర్నెట్ సెంటర్లు బంద్

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ఏపీ ఇంటర్మీడియట్ బోర్డు సూచనల మేరకు మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు పరీక్షా కేంద్రాల వద్ద ఫొటోస్టాట్, ఇంటర్నెట్ సెంటర్లను బంద్ చేయాలని కార్మిక శాఖ ఉపకమిషనర్ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు ఆంక్షలు అమల్లో ఉంటాయన్నారు.



అసంపూర్తిగా ఆడిని మెడికల్ కళాశాల భవనం



# కేశవ్.. కరుణ చూపేనా..?


- సాగునీటి ప్రాజెక్టులకు రూ.3,264 కోట్లు ప్రతిపాదన
- అసంపూర్తి ఉర్దూ వర్సిటీపై దయ చూపాలి
- క్లస్టర్ వర్సిటీలో 'రీసెర్చ్ సెంటర్' వచ్చేనా..?
- మెడికల్ కాలేజీలను పట్టించుకోవాలి
- నేడు అసెంబ్లీలో 2025-26 బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

కర్నూలు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి):

సీఎం చంద్రబాబు సారథ్యంలో కొలువుదీరిన టీడీపీ కూటమి ప్రభుత్వం శుక్రవారం 2025-26 బడ్జెట్ శుక్రవారం (నేడు) అసెంబ్లీలో ప్రవేశపెట్టనుంది. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ బాధ్యతలు చేపట్టాక ప్రవేశపెట్టే సంపూర్ణ బడ్జెట్ ఇది. ఇప్పటికే వివిధ శాఖలు, జిల్లాల వారీగా ప్రతిపాదనలు తెప్పించుకొని పద్దుల వారిగా అంకెల కూర్పు సిద్ధం చేశారు. వార్షిక బడ్జెట్ ఆమోదం కోసం ఉదయం 9 గంటలకు సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంత్రివర్గ సమావేశ అవుతుంది. ఈ తరువాత అసెంబ్లీలో ప్రవేశపెడుతారు. ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు టీజీ భరత్, ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్దన్‌రెడ్డి సహా ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు నియోజకవర్గాల వారీగా బడ్జెట్ కోసం వినతిపత్రాలు ఇచ్చారు. అదే క్రమంలో జిల్లాలో శాఖవారిగా కూడా ప్రతిపాదనలు తెప్పించుకున్నారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో సాగునీటి ప్రాజెక్టులకు రూ.3,264 కోట్లు అవసరం ఉందని ఆ శాఖ చీఫ్ ఇంజనీర్లు (సీఈ) ప్రతిపాదించారు. క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలో పరిశోధన కేంద్రం (రీసెర్చ్ సెంటర్) ఏర్పాటుకు రూ.150 కోట్లు అడిగారు. పల్లె జనం గొంతు తడిపేందుకు 'జల జీవన్ పథకం' కింద రూ.3 వేల కోట్లు ప్రతిపాదించారు. గ్రామీణ రోడ్ల అభివృద్ధి, పేదల పక్కా గృహాలు సరేసరి. ఉమ్మడి కందనవోలు జిల్లాపై విత్త మంత్రి పయ్యావుల కేశవ్ కనికరం చూపాల్సి అవసరం ఎంతైనా ఉంది. ఉమ్మడి జిల్లాలో ప్రధానమైన శాఖలకు ఎంత నిధులు అవసరం ఉందో..? ఇప్పటికే ప్రతిపాదించారు.

### రూ.3,264 కోట్లు కేటాయించాలి

కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 9.50 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రాజెక్టులు, కాలువలు నిర్వహణ, అసంపూర్తి ప్రాజెక్టులకు రూ.1,200 కోట్లు అవసరం ఉందని అంచనా వేస్తే.. ప్రభుత్వం సూచనమేరకు రూ.924 కోట్లు ఇవ్వాలని జలవనరుల శాఖ ప్రాజెక్ట్స్ సీఈ కబీర్‌బాషా ప్రతిపాదనలు పంపారు. శ్రీశైలం ప్రాజెక్టుకు రూ.55 కోట్లు, టీబీపీ ఎల్లెల్సీ, వేదావతి, ఆర్డీఎస్ కుడి కాలువ హెడ్ ఆఫ్ అకౌంట్ కింద రూ.250 కోట్లు, కేసీ కెనాల్, కుందూ నది విస్తరణకు కోసం రూ.180 కోట్లు, రాజోలి, జొలదరాశి ప్రాజెక్టులకు రూ.40 కోట్లు, ఎస్సార్బీసీ కాలువకు రూ.40 కోట్లు, గురురాఘవేంద్ర ప్రాజెక్టుకు రూ.30 కోట్లు, గాజులదిన్నె ప్రాజెక్టుకు రూ.28 కోట్లు, హంద్రీనీవా కాలువ నుంచి 68 చెరువులకు నీటిని ఎత్తిపోసే పథకానికి రూ.40 కోటు కేటాయింపులు చేయాలని కోరారు. అలాగే.. హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టుకు రూ.3,500 కోట్లు కేటాయించాలని అనంతపురం సీఈ నాగరాజు ప్రతిపాదించారు. అందులో కర్నూలు జిల్లాలో విస్తరణకు రూ.690 కోట్లు అవసరం ఉంది. గాలేరు-నగరి ప్రాజెక్టుకు రూ.3,500 కోట్లు కావాలని తిరుపతి సీఈ మల్లికార్జునరెడ్డి ప్రతిపాదనం పంపారు. అందులో నంద్యాల జిల్లాలో పనులకు రూ.450 కోట్లు అవసరం ఉంది. ఎన్టీఆర్ తెలుగుగంగ ప్రాజెక్టుకు రూ.5,400 కోట్లు కేటాయింపులు చేయాలని కడప సీఈ శ్రీనివాసులు ప్రతిపాదించారు. నంద్యాల జిల్లాకు రూ.1,200 కోట్లు కావాలి. అయితే.. కర్నూలు జిల్లాలో కరువు.. వలసలు నివారణ లక్ష్యంగా చేపట్టిన వేదావతి, ఆర్డీఎస్ కుడి కాలువలు కనీసం రూ.వెయ్యి కోట్లు ఇవ్వాలని ప్రతిపాదించారు.



హంద్రీనీవా ప్రధాన కాలువ

### వర్సిటీలపై దృష్టి సారించాలి

- రాష్ట్రంలో ఏకైక ఉర్దూ యూనివర్సిటీ డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వావిద్యాలయం. నవ్యాంధ్రలో అత్యధికంగా ముస్లిం జనాభా కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఉన్నారని గుర్తించి 2017-18లో అప్పటి టీడీపీ ప్రభుత్వం కర్నూలులో ఏర్పాటు చేసింది. ఓర్వకల్లు వద్ద 144.92 ఎకరాల్లో శాశ్వత భవనం నిర్మాణం కోసం ఫేజ్-1 కింద అడామిక్ బ్లాక్, బాలికల హాస్టళ్లు, విశాలమైన రోడ్లు నిర్మాణాలు రూ.18 కోట్లతో చేపట్టారు. 2019లో వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లు నిర్లక్ష్యంగా వదిలేసింది. మళ్లీ టీడీపీ కూటమి ప్రభుత్వం రావడంతో ఆశలు చిగురించాయి. ఈ బడ్జెట్‌లో సిబ్బంది జీతాలు, నిర్వహణ, శాశ్వత భవనాలు నిర్మాణాల కోసం రూ.31.26 కోట్లు ఇవ్వాలని వర్సిటీ అధికారులు ప్రతిపాదించారు.
- జగన్నాథగట్టుపై 50.5 ఎకరాల్లో క్లస్టర్ యూనివర్సిటీ శాశ్వత భవనాలు రూ.139 కోట్లతో చేపట్టారు. వైసీపీ ప్రభుత్వం రూ.20 కోట్లు బిల్లులు పెండింగ్ పెడితే.. టీడీపీ కూటమి ప్రభుత్వం ఇటీవలే ఆ నిధులు ఇచ్చింది. 2025-26 బడ్జెట్‌లో నిర్వహణ కోసం రూ.2 కోట్లు, జీతాలకు రూ.1.10 కోట్లు సహా రీసెర్చ్ సెంటర్ ఏర్పాటుకు రూ.150 కోట్లు అవసరం ఉందని యూనివర్సిటీ అధికారులు ప్రతిపాదనలు పంపారు.
- రాయలసీమ యూనివర్సిటీ గత పాలకుల నిర్లక్ష్యానికి గురైంది. ఈ బడ్జెట్‌లో నిర్వహణ, జీతాల కోసం రూ.13 కోట్లు అవసరం ఉందని ప్రతిపాదించారు. జగన్నాథగట్టుపై రాయలసీమ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల 192 ఎకరాల్లో జగన్నాథగట్టుపై రూసా నిధులు రూ.20 కోట్లు చేపడితే పునాదులతో ఆగిపోయింది.

మిగతా 7వ పేజీలో



అసంపూర్తిగా ఆగిపోయిన క్లస్టర్ యూనివర్సిటీ

## రమణీయంగా బుగ్గ రామేశ్వరుని కల్యాణం

భారీగా తరలివచ్చిన భక్తులు



కాల్వబుగ్గలో స్వామి, అమ్మవార్లకు కళ్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

ఓర్వకల్లు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాల్వబుగ్గ క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా గురువారం తెల్లవారుజామున స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం వైభవంగా రమణీయంగా జరిగింది. ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, గౌరు వెంకటరెడ్డి, వారి కుమారుడు గౌరు జనార్ధన్‌రెడ్డి.. స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. వారికి టీటీడీ బోర్డు సభ్యులు మల్లెల రాజశేఖర్, ఈవో మద్దిలేటి, ఆలయ ప్రధాన అర్చకులు కల్లె లక్ష్మీనారాయణశర్మ మేళతాళాలతో స్వాగతం పలికారు. గౌరు దంపతులు పట్టువస్త్రాలను స్వామివారికి సమర్పించి పూజల్లో పాల్గొన్నారు. అనంతరం వేద పండితులు ఘనంగా స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. సాయంత్రం సింహవాహన సేవ, నందివాహన సేవ, ప్రభోత్సవం వైభవంగా జరిగింది. టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్, టీడీపీ యువ నాయకుడు గౌరు జనార్దన్ రెడ్డి ప్రభను లాగి యథ్థానంలో నిలిపారు. ఈ కార్యక్రమంలో పెసిడెంట్ కమిటీ సభ్యులు కాటెంనె నారాయణ, కాకి దేవేంద్ర, రామాంజనేయశర్మ, ఎంపీడీవో శ్రీనివాసులు, తహసీల్దార్ విద్యాసాగర్ పాల్గొన్నారు.



పట్టువస్త్రాలు తీసుకువస్తున్న గౌరు కుటుంబ సభ్యులు



అశేష భక్త జనవాహిని నడుమ రథోత్సవం

## శోభాయమానం... ఆదిదేవుడి రథోత్సవం

- శివ నామస్మరణతో మార్మోగిన శ్రీగిరి
- అశేష భక్తజనం నడుమ రథోత్సవం
- కన్నులపండువగా తెప్పోత్సవం



పుష్కరిణిలో స్వామివారి తెప్పోత్సవం

శ్రీశైలం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజోతి): శ్రీగిరిపై బ్రహ్మోత్సవ రథాన్ని అధిరోహించిన మల్లికార్జునుడు భ్రమరాంబ సమేతుడై అశేష భక్తజనం నడుమ విహరించారు. గురువారం సాయంత్రం రథశాల వద్ద కలెక్టర్ రాజకుమారి, ఈవో శ్రీనివాసరావు, ఎస్పీ విక్రాంత్ పాటిల్ సమక్షంలో ఆలయ అర్చకులు రథానికి రథాంగపూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయ దేవాలయ ప్రాంగణంలో విశేష అర్చనలు, హారతులు అందుకున్న స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకిలో రాజగోపురంమీదుగా రథశాల వద్దకు మేళతాళాలు, భజంత్రీల నడుమ తీసుకొచ్చారు. పుష్ప ప్రియుడైన మల్లయ్యకు సుగంధ పుష్పాలు, పరిమళ ద్రవ్యాలతో అలకంరించిన రథంపై ఉత్సవమూర్తులను అధిష్ఠింపజేసి సాత్వికబలిగా కొబ్బరికాయలను, గుమ్మడికాయలను సమర్పించారు. గంగాధర మండపం నుంచి నంది మండపం దాకా, అక్కడి నుంచి తిరిగి గంగాధర మండపం దాకా రథోత్సవం సాగింది. రథంపై ఆదిదేవుడు ఆశీనులై సాగుతుండగా... ఓం నమఃశివాయ నామస్మరణతో అశేష భక్తులు శివనామస్మరణ చేస్తూ ఆదిదేవుడి వైభవాన్ని వీక్షించారు.

### నేత్రపర్వంగా తెప్పోత్సవం


మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ఆలయ పుష్కరిణిలో తెప్పోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా జరిపారు. కార్యక్రమంలో ముందుగా ఆలయ ప్రాంగణంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు షోడశోపచార పూజలు నిర్వహించారు. అనంతరం పుష్పాలంకృత పల్లకీలో ఊరేగింపుగా ఆలయ రాజగోపురం మీదుగా వెలుపలికి తోడ్కొని వచ్చి మేళతాలాల నడుమ పుష్కరిణి వద్ద ఏర్పాటు చేసిన తెప్పపై ఆశీనులను చేసి విశేష పూజాధికాలు చేశారు.

**నేడు పూర్ణాహుతి :** మహాశివరాత్రి బ్రహ్మోత్సవ క్రతువులకు శుక్రవారం పూర్ణాహుతి నిర్వహిస్తారు. ఉదయం 8 గంటలకు యాగశాలలో పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించి అనంతరం కలశోద్వాసన, అవబృథం, త్రిశూలస్నానం, వసంతోత్సవం నిర్వహిస్తారు. సాయంత్రం ధ్వజావరోహణ చేయనున్నారు.

## తాగునీటికి రూ.6.91 కోట్లతో ప్రతిపాదనలు

ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వేసవిలో జిల్లాలోని పలు గ్రామాల ప్రజల దాహం తీర్చేందుకు రూ.6.91 కోట్లు అవసరమవుతాయని రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటి వరకు ఎక్కడ కూడ తాగునీటి ఎద్దడి రాలేదన్నారు. వివిధ ఎస్ఎస్ ట్యాంకుల్లో కూడ నీరు సమృద్ధిగా ఉందన్నారు. అయితే రానున్న మార్చి ఏప్రిల్ మే నెలలను దృష్టిలో ఉంచుకొని క్షేత్రస్థాయిలోని ఇంజనీర్ల ద్వారా ఎన్ని గ్రామాలలో నీటి ఎద్దడి సమస్య ఉత్పన్నమవుతుందనే అంశంపై సర్వే నిర్వహించి నివేదికలను తెప్పించుకున్నామన్నారు. ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకూడదని రూ.3.89 కోట్లతో ట్రాన్స్‌పోర్టేషన్ ద్వారా తాగునీటిని సరఫరా చేయాలని ప్రతిపాదనలు రూపొందించామన్నారు. అలాగే 1.2 కోట్లతో సమీప గ్రామాల్లో నీటి వనరులను అద్దెకు తీసుకోడానికి, ఎస్ఎస్ ట్యాంకులకు నింపడానికి రూ.5 కోట్లు వ్యయం అవుతాయని అంచనా వేశామన్నారు. రూ.2.95 కోట్లతో బోర్లలో డీపెనింగ్, ఫ్లషింగ్ చేసేందుకు ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి పంపించామన్నారు. ఆదోని, కౌతాళం, ఆస్పరి, పెద్దకడుబూరు, కోసిగి, మద్దికెర, తుగ్గలి, వెల్దుర్తి మండలాల్లోని 115 గ్రామాలకు నీరు సరఫరా చేయడానికి చర్యలు తీసుకుంటామని ఎస్ఈ తెలిపారు.



# టెన్షన్ వద్దు


- మెలకువలు పాటిస్తే అద్భుత విజయాలు
- మార్చి 1 నుంచి ఇంటర్.. 18 నుంచి టెన్త్ పరీక్షలు
- అభ్యసనకు ఇదే మంచి సమయం
- తగిన నిద్ర, ఆహారం తీసుకోవాలి
- విద్యార్థులకు విశ్లేషకులు, విద్యావేత్తల సూచన

**ఇది విద్యార్థుల పరీక్షల సీజన్. ఇప్పటికే ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. మార్చి 1వ తేదీ నుంచి ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలు, మార్చి 17వ తేదీ నుంచి 31 వరకు పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి. పరీక్షలు దగ్గర పడుతుండటంతో విద్యార్థుల్లో ఆందోళన మొదలైంది. కర్నూలు జిల్లాలో 514 పాఠశాలల నుంచి 38,560 మంది, నంద్యాల జిల్లాలో 13,400 మంది పదో తరగతి పరీక్షలకు హాజరు కానున్నారు. అలాగే ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు కర్నూలు జిల్లా నుంచి 46,235 మంది, నంద్యాల జిల్లా నుంచి 25,542 మంది పరీక్షలకు హాజరు కానున్నారు. ఈ పరీక్షలే కాకుండా ఏపీఈఏపీ టెట్, నీట్, జేఈఈ-మెయిన్స్, జేఈఈ-అడ్వాన్స్‌డు పరీక్షలు కూడా జరగనున్నాయి. వేసవి వేడిమి ఒక పక్క, పరీక్షల టెన్షన్ మరోపక్క విద్యార్థులను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. అయితే కొన్ని జాగ్రత్తలను పాటిస్తే అద్భుత విజయాలు సాధించవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు.**

కర్నూలు ఎడ్యుకేషన్/ కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఇది విద్యార్థుల పరీక్షల సీజన్. ఇప్పటికే ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. మార్చి 1వ తేదీ నుంచి ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలు, మార్చి 17వ తేదీ నుంచి 31 వరకు పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి. పరీక్షలు దగ్గర పడుతుండటంతో విద్యార్థుల్లో ఆందోళన మొదలైంది. కర్నూలు జిల్లాలో 514 పాఠశాలల నుంచి 38,560 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరు కానున్నారు. అలాగే 160 జూనియర్ కళాశాలల నుంచి ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 46,235 మంది పరీక్షలకు హాజరు కానున్నారు. ఈ పరీక్షలే కాకుండా ఏపీఈఏపీ టెట్, నీట్, జేఈఈ-మెయిన్స్, జేఈఈ-అడ్వాన్స్‌డు పరీక్షలు కూడా జరగనున్నాయి. వేసవి వేడిమి ఒక పక్క, పరీక్షల టెన్షన్ మరోపక్క విద్యార్థులను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. అయితే కొన్ని జాగ్రత్తలను పాటిస్తే అద్భుత విజయాలు సాధించవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు.

### పరీక్షకు ముందు రోజు..

- రేపటి పరీక్ష సిలబస్‌ను దృష్టిలో ఉంచుకుని టైమ్‌టేబుల్ తయారు చేసుకోవాలి.
- ఇంతవరకు చదవని అంశాల జోలికి పోరాదు. రాని అంశాన్ని వదిలివేయాలి. వచ్చిన అంశాలనే మననం చేసుకోవాలి.
- రాత్రి పది గంటల తర్వాత చదవడం అంత మంచిదికాదు. ప్రతి విద్యార్థి కనీసం 6 నుంచి 8 గంటలు నిద్రపోవాలి. నిద్రలేమితో పరీక్షకు పోతే అసలుకే మోసం వచ్చే ప్రమాదముంది.
- పరీక్షలకు కష్టపడి చదువుతున్నాం .. అని భావించకుండా ఇష్టపడి చదవాలి. జీవిత లక్ష్యాన్ని ఏర్పరచుకుంటే దానికి 10వ తరగతి మొదటి తొలి మజిలీ అని మరచిపోరాదు.
- ఉపాధ్యాయులు సూచిన ముఖ్యమైన అంశాలను తప్పకుండా చదవాలి.
- పరీక్షల సమయంలో మనో ధైర్యాన్నిమించిన మందు లేదు.



### సాధారణ విషయాలు

- పరీక్ష సమయం విలువైంది. ఏ పరీక్షనూ నిర్లక్ష్యం చేయడానికి, వదిలేయడానికి వీల్లేదు.
- మానసిక ఆందోళనకు, భావోద్వేగాలకు గురికారాదు.
- పరీక్షల కాలంలో టీవీ, సినిమాల జోలికి వెళ్లరాదు.
- కాలినడక, సైకిల్, వాహనం, బస్సుపై ప్రయాణించేటప్పుడు ఎలాంటి ప్రమాదాలకు గురికాకుండా జాగ్రత్త [illegible]హించాలి. పరీక్షల మధ్యలో సెలవు వచ్చినప్పుడు ఆటల జోలికి వెళ్లరాదు.
- వేసవి తీవ్రతను తట్టుకునేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.
- ఆకుకూరలు, పండ్లు, పండ్ల రసాలు, ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి.
- ఎక్కువసార్లు తక్కువ మోతాదులో ఆహారం తీసుకోవాలి.
- పరీక్షల కాలంలో మాంసాహారం, కొవ్వుపదార్థాలు, అతివేడి, అతి శీతల పదార్థాలు, స్వీట్లు, మసాలాలకు దూరంగా ఉండడం మంచిది.
- సులభంగా జీర్ణమయ్యే ఆహార పదార్థాలను మాత్రమే తీసుకోవాలి.
- ఆరోగ్య విషయంలో ఎలాంటి అశ్రద్ధ పనికిరాదు.
- నిర్లక్ష్యం, కోపం, భయం, అసూయ, ఈర్ష, ద్వేషం, దుఃఖం, బద్దకం, ఆందోళనలను దరి చేరనివ్వరాదు.
- నలుగురు కలిసి చదవడం, అవసరమైన అంశాలపై గ్రూపుగా చర్చించడం వల్ల మంచి ఫలితాలు సాధించవచ్చు. కానీ అనవసర విషయాలు చర్చిస్తే మొదటికే మోసం రావచ్చు.
- పరీక్ష రాస్తున్నప్పుడు జవాబులపై మాత్రమే మనసు కేంద్రీకరించాలి. పరీక్ష హాల్‌లోకి వచ్చే అధికారుల గురించి పట్టించుకోనవసరం లేదు. అలాగే పక్కవాళ్లు ఏం చేస్తున్నారని చూడకూడదు. దానివల్ల సమయం వృథా అవుతుంది.



### ఈ సమయమే చాలా కీలకం

విద్యార్థులకు ఈ సమయం కీలకం. కొత్త పరీక్షల వేళలో కొత్త పాఠ్యాంశాల జోలికి వెళ్లరాదు. నేర్చుకున్నవాటినే ఎక్కువసార్లు రివిజన్ చేస్తూ ప్రాక్టీసు చేయాలి. ముందు నుంచి కష్టపడి చదివితే పరీక్షల సమయంలో సులభంగా ఉంటుంది. అయితే సమయాన్ని వృథా చేసి పరీక్షల సమయంలో హైరానా పడు తుంటారు. విద్యార్థులు అతిగా ఆలోచించి ఆందోళనకు గురికాకూడదు. కష్టమైన సబ్జెక్ట్‌లను మనస్సు ప్రశాంతంగా ఉన్నప్పుడు చదవాలి.

- హనుమంతరావు, కర్నూలు ఉప విద్యాశాఖ అధికారి



### కొత్త సిలబస్ జోలికి వెళ్లవద్దు

పరీక్షలు దగ్గరపడుతున్నాయి. కొత్త సిలబస్ జోలికి వెళ్లరాదు. జవాబులు నేర్చుకునేటప్పుడు శ్రద్ధ, ఏకాగ్రత అవసరం. చదివేటప్పుడు గతాన్ని గురించి బాధాకరమైన భావనలు, అనుమానాలు, ఆలోచనలు లేకుండా చదువుపైనే దృష్టి నిలపాలి. పరీక్షల సమయంలో సాత్విక ఆహారం తీసుకోవాలి. ప్రతి రోజు 7 గంటల నిద్ర అవసరం. ధైర్యంగా, పాజిటివ్ ఆలోచనలతో చదవాలి. చదవాల్సిన పాఠాలను ముందుగా ప్రణాళిక వేసుకోవాలి. సమయపాలన తప్పకుండా పాటించాలి. గంట చదివిన తరువాత పది నిమిషాలు విశ్రాంతి అవసరం.

- శిరిగిరెడ్డి జయారెడ్డి, సైకాలజిస్టు, హిప్నోథెరపిస్టు



### ఒత్తిడిని జయించాలి

విద్యార్థులు ముందుగా ఒత్తిడిని జయించాలి. అప్పుడే పరీక్షలను సులభంగా ఎదుర్కోగలరు. సమయాన్ని వృథా చేయకుండా ముందుకు సాగితే విజయం తథ్యం.

- సంజీవరెడ్డి, ప్రిన్సిపాల్, మోడల్‌స్కూల్, కొలిమిగుండ్ల



### సమయాన్ని వృథాగా చేయకూడదు

విద్యార్థులు పరీక్షలకు ముందు అనుమానాలు నివృత్తి చేసుకోవాలి. తెలియని విషయాలపై ఎప్పటికప్పుడు గురువులను సంప్రదించి తెలుసుకోవాలి. ఒత్తిడిని తగ్గించుకోవడానికి బాగా తెలిసిన ప్రశ్నలకు సమాధానం రాయాలి. సమయాన్ని వృథా చేసుకోకూడదు.

- రమణయ్య, ఉపాధ్యాయుడు, పెట్నికోట జడ్పీ స్కూల్



### ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి

పరీక్షల సమయంలో విద్యార్థులపై తీవ్రమైన ఒత్తిడి ఉంటుంది. అందువల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. మరోవైపు ఇదే సమయంలో ఎండలు అధికంగా ఉన్నందున ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. నీరు ఎక్కువగా తాగడం వల్ల ఉపశమనం పొందవచ్చు

- డాక్టర్ శివశంకరరెడ్డి, రిటైడ్ డీఎంహెచ్‌వో

## జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువు పొడిగింపు

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువు ముగుస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలోని జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల కాలపరిమితిని మూడు నెలల పాటు అంటే మార్చి 1 2025 నుంచి మే నెల 31వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకుడు హిమాన్షు శుక్లా ఉత్తర్వులు జారీ చేసినట్లు కర్నూలు సమాచార శాఖ డీఐపీఆర్వో జయమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు జిల్లాలో ప్రస్తుతం ఫిబ్రవరి 28 వరకు అక్రిడిటేషన్ కార్డుల వాలిడిటీ ఉన్న పాత్రికేయులకు మార్చి 1 నుంచి మే 31 వరకు పొడిగింపు సౌకర్యం ఉంటుందని తెలిపారు.

## పోసాని కృష్ణమురళిపై విచారణ జరిపించాలి

**టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య**

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో చలనచిత్ర, టీవీ, నాటకరంగ అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా వ్యవహరిస్తూ, 2023 డిసెంబరులో గుంటూరులో జరిగిన నంది నాటక పోటీల్లో అవకతవకలకు పాల్పడిన సినీ నటుడు పోసాని కృష్ణమురళిపై విచారణ జరిపించాలని, నంది అవార్డు గ్రహీత, కర్నూలు టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య డిమాండ్ చేశారు. గురువారం కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోసాని కృష్ణమురళి నాటక పోటీల్లో పాల్పడిన అవకతవకలపై రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక, చలనచిత్ర అభివృద్ధి సంస్థ మంత్రి కందుల దుర్గేష్‌కు ఒక లేఖ ద్వారా కళాకారులంతా ఫిర్యాదు చేస్తున్నామని తెలిపారు. నంది పోటీలకు నియమించే న్యాయ నిర్ణేతల్లో సీనియర్ నటులను కాదని, వైసీపీ విధేయులను ఎంపిక చేసి, తన పక్షపాత ధోరణిని ఆయన నిరూపించుకున్నారని చెప్పారు. తమ టీజీవీ కళాక్షేత్రం సంస్థ ద్వారా నంది పోటీల్లో ప్రదర్శించిన 'శ్రీకృష్ణ కమలపాలిక' నాటకానికి టీడీపీ ముద్రవేసి నంది బహుమతి రాకుండా అన్యాయం చేశారని ఆరోపించారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

ఆత్మకూరు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణ శివార్లలోని శ్రీశైలం రస్తాలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సుమిత్ర (26) అనే యువకుడు మృతి చెందాడు. ఎస్‌ఐ నారాయణరెడ్డి వివరాల మేరకు.. ఆత్మకూరు మండలంలోని శ్రీపతిరావుపేట గ్రామానికి చెందిన సుమిత్ర ఆత్మకూరు పట్టణంలో తన పని ముగించుకుని స్వగ్రామానికి బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న బొలేరో వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో సుమిత్ర అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ నారాయణరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

## వక్ఫ్ బోర్డు ఆస్తులను కాపాడతాం

**ఏపీ స్టేట్ వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్**



మాట్లాడుతున్న ఏపీ స్టేట్ వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్

కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బోర్డు ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపడుతామని ఏపీ స్టేట్ వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ఉస్మానియా కళాశాల రోడ్డు పక్కన ఉన్న ఉమర్ అరబిక్ పాఠశాల ప్రాంగణాన్ని పరిశీలించాక ఆయన విలేఖరులతో మాట్లాడుతూ 102 సంవత్సరాల కింద ఈ పాఠశాలను ఏర్పాటు చేశారని అన్నారు. డా.అబ్దుల్ హక్ అంజ నన్-ఇ-ఇస్లామియా ఆర్గనైజేషన్‌ను స్థాపించారన్నారు. ఈ ఆర్గనైజేషన్ ద్వారా ఎలిమెంటరీ స్కూల్, హై స్కూల్, యునానీ కాలేజీలు నడుస్తున్నాయని అన్నారు. వక్ఫ్ బోర్డు ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా కాపాడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి సబీహా పర్వీన్, పాఠశాల ఆర్గనైజేషన్ కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కేఆర్ఎంబీని కర్నూలులో పెడితేనే ప్రాజెక్టుల మనుగడ

**రాయలసీమ సాగు నీటి సాధన సమితి**



నంద్యాల మున్సిపాలిటీ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కృష్ణా నది యాజమాన్య బోర్డును కర్నూలు ఏర్పాటు చేస్తేనే సీమలో ఉన్న ప్రాజెక్టుల నిర్వహణ, మనుగడ ఉంటుందని రాయలసీమ సాగు నీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ కేఆర్ఎంబీని కర్నూలులో కాకుండా మరే ప్రాంతంలో పెట్టినా సీమ ప్రాజెక్టుల నిర్వహణతోపాటు స్థిరీకరణ విషయంలో ఈ ప్రాంత రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. హంద్రీనీవా సుజలా స్రవంతి, గాలేరు నగరి సుజలా స్రవంతి, వెలుగొండ, తెలుగు గంగ ప్రాజెక్టుల నిర్వహణతో పాటు శ్రీశైలం ప్రాజెక్టులో నీటి నిర్వహణ నియంత్రణ విషయంలో సీమ రైతాంగం నష్టపోకూడదంటే కృష్ణానది యాజమాన్య బోర్డును కర్నూలులో ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కేఆర్ఎంబీని కర్నూలులో ఏర్పాటు చేసే విషయంలో అఖిల పక్ష నాయకులు ఐక్యంగా ముందు సాగి ముక్త కంఠంతో నినదిస్తే తప్ప సీమ రైతులు జీవితాలు బాగుపడవని గుర్తు చేశారు. ఇప్పటికే రాష్ట్ర సగటుతో పోలిస్తే రాయలసీమ సాగు విస్తీర్ణ శాతం ఆందోళనకరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

## శానిటేషన్ సూపర్‌వైజర్ ఆత్మహత్యాయత్నం

**స్టేట్‌మెంట్ రికార్డు చేసిన పోలీసులు**

కర్నూలు హాస్పిటల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఓ అధికారి వేధింపులు తట్టుకోలేక బుధవారం శానిటేషన్ సూపర్‌వైజర్ హర్షవర్ధన్ (28) ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. 40 నిద్రమాత్రలు మింగి అపస్మారక స్థితిలోకి వెళ్లిన సూపర్‌వైజర్‌ను తల్లిదండ్రులు నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. ప్రస్తుతం ఆయన ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. నాల్గవ పట్టణ పోలీసులు గురువారం వచ్చి అతని నుంచి స్టేట్‌మెంటు రికార్డు చేశారు. ఓ అధికారి వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్యాత్నం చేసినట్లు ఆయన తెలిపారు. కొంత మంది పారిశుధ్య కార్మికుల మాటలు విని అధికారి వాళ్ల ఎదుటే అమర్యాదగా మాట్లాడతారని పోలీసులకు చెప్పినట్లు తెలిసింది. శివరాత్రి పండుగ ఉన్నా మీటింగ్ కు రావాలని ఓ ఉద్యోగితో ఫోన్ చేయించి వేధించారని, ఇలాంటి ఒత్తిడిని తట్టుకోలేక నిద్రమాత్రలు మింగినట్లు స్టేట్‌మెంటు ఇచ్చాడు. ఈ ఘటనపై కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ అధికారులతో శానిటేషన్ కాంట్రాక్టరు చర్చించారు. ఈ సమావేశంలో ఓ అధికారి మాట్లాడుతూ శానిటేషన్ సూపర్‌వైజర్ ఆత్మహత్యాయత్నం గురించి పత్రికల్లో రాకూడదని హుకుం జారీ చేశారు. దీనిపై ఆసుపత్రి సూపరింటెండెంట్ స్పందిస్తూ సదరు అధికారి తన మాటతీరు మార్చుకోవాలని అన్నారు.

## కేశవ్.. కరుణ చూపేనా?

(5వ పేజీ తరువాయి)

### పల్లె దాహం తీరాలంటే 'జల'సిరి కావాలి


ఉమ్మడి జిల్లాలో 804 పంచాయతీలు ఉన్నాయి. మరో 475కి పైగా మజారా గ్రామాలు ఉన్నాయి. కర్నూలు జిల్లాలో 3,38,865, కర్నూలు జిల్లాలో 3.25 లక్షల జన నివాసాలు ఉన్నాయి. 25-30 శాతం ఇళ్ల కూడా కుళాయి కనెక్షన్లు లేవు. ఇప్పటికీ గ్రామీణ ప్రజలు వీధి కుళాయిలు, బోర్లు, వంకలు, వాగుల్లో చెలిమిలపై ఆధార పడుతున్నారు. ఇంటింటికి కుళాయి కనెక్షన్ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం 'జల్ జీవన్ మిషన్ (జేజేఎం)' పథకం తీసుకొచ్చినా గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా లక్ష్యం నెరవేరలేదు. ఆయా జలాశయాల నుంచి శుద్ధి చేసిన తాగునీరు అందించేందుకు జేజేఎం కింద కర్నూలు జిల్లా నుంచి రూ.1,542 కోట్లు, నంద్యాల జిల్లాలో రూ.1,450 కోట్లకు పైగా నిధులు అవసరం ఉంది. సగ్రమ రక్షిత మంచినీటి పథకాల నిర్వహణ సరేసరి.

### మెడికల్ కాలేజీలు పూర్తి చేయాలి

కర్నూలు సర్వజన వైద్యశాల, మెడికల్ కాలేజీ భవనాలు, ఆదోని మెడికల్ కళాశాల, బోధనాస్పత్రి నిర్మాణాలు రూ.930 కోట్లతో చేపడితే.. వివిధ దశల్లో పనులు ఆపేశారు. కర్నూలు ప్రభుత్వం ఆస్పత్రిలో రోగులకు సరిపడా బ్లాకులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అసంపూర్తి పనులు తక్షణమే పూర్తి చేయాలి. ఆదోని మెడికల్ కాలేజీ నిర్మాణం పూర్తి చేస్తే పశ్చిమ ప్రాంత వాసులకు అనుకూలంగా ఉంటుంది.



ముళ్ల కంపలతో నిండిపోయిన పత్తికొండ జలాశయం



హెడ్ స్లూయిస్ పనులతో ఆగిపోయిన ఆర్డీఎస్ కుడి కాలువ

### రహదారుల శాశ్వత మరమ్మతులు చేపట్టాలి

రోడ్లు భవనాలు, పంచాయతీ రాజ్ శాఖ పర్యవేక్షణలోని రహదారులు గత వైసీపీ పాలనలో ఐదేళ్ల నిర్లక్ష్యం కారణంగా గుంతల మయంగా మారాయి. టీడీపీ కూటమి ప్రభుత్వం రాగానే రోడ్ల గుంతలు పూడ్చింది. శాశ్వత మరమ్మతుల కోసం రోడ్లు భవనాల శాఖ కర్నూలు జిల్లాలో రూ.85 కోట్లు, నంద్యాల జిల్లాలో రూ.125 కోట్లు ఇవ్వాలిన ప్రతిపాదించారు. పంచాయతీరాజ్ (పీఆర్) కర్నూలు జిల్లాలో రూ.212 కోట్లు, నంద్యాల జిల్లాలో రూ.195 కోట్లు అవసరం ఉందని ప్రతిపాదనలు పంపినట్లు సమాచారం. ఈ నిధులు కాదని నాబార్డు కింద రోడ్లు విస్తరణ, ఆధునికీకరణకు నిధులు ఇవ్వాలని ప్రతిపాదించారు.

## నీటి తొట్టెలోపడి చిన్నారి మృతి

**కన్నీరు మున్నీరైన తల్లిదండ్రులు**



సూర్య(ఫైల్)

రుద్రవరం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : చిన్నారి బాబును ఇంటి దగ్గర వదిలి తల్లిదండ్రులు పొలానికి వెళ్లారు. పిల్లవాడు ఆడుకుంటూ వెళ్లి నీటి తొట్టిలోపడి మృతి చెందాడు. ఈ ఘటన గురువారం మండలంలోని రెడ్డిపల్లె గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన చిన్నరాయుడు-నీరజ దంపతులకు ఇద్దరు మగ పిల్లలు. చిన్న కుమారుడు సూర్యకు ఏడాది వయసు. ఇద్దరు పిల్లలను ఇంట్లో వృద్ధురాలి దగ్గర వదిలేసి ఉదయాన్నే పొలం పనులకు వెళ్లారు. వృద్ధురాలు పక్కకు వెళ్లిన సమయంలో చిన్నారి సూర్య ఆడుకుంటూ వెళ్లి ఇంటి ముందు ఉన్న నీటి తొట్టిలో ప్రమాదవశాత్తు పడి ఊపిరాడక మృతి చెందాడు. ఈ సంగతి తెలిసి తల్లిదండ్రులు ఇంటికి వచ్చి మృతి చెందిన బాలుడ్ని చూసి కన్నీరుమున్నీరయ్యారు. వారి విషాదం గ్రామస్తుల కంట తడి పెట్టించింది.

## కుక్కల నియంత్రణకు చర్యలు: కమిషనర్


కుక్కల శస్త్ర చికిత్స కేంద్రాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

**కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి):** నగరంలో కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేషన్ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అన్నారు. గురువారం ఆయన గార్గేయపురం డంప్ యార్డులోని కుక్కల సంతాన నిరోధక శస్త్ర చికిత్స కేంద్రాన్ని సందర్శిం చారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో కుక్కలకు సంతాన నిరోధక శస్త్ర చికిత్సలను తిరిగి ప్రారంభించినట్లు వెల్లడించారు.

## దామోదరం కృష్ణవేణి వర్ధంతి



కృష్ణవేణి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

**కల్లూరు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి):** మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య సతీమణి కృష్ణవేణి వర్ధంతిని ఆయన స్వగ్రామమైన పెద్దపాడులో నిర్వహించారు. గురువారం దామోదరం సంజీవయ్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దామో దరం రాధాకృష్ణ మూర్తి ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి సుంకన్న, మల్లికార్జున, రచయిత పెరికల రంగస్వామి, మహేష్, పెద్దపాడు గ్రామస్థులు పాల్గొన్నారు.

## నగర పాలక డీసీపీగా శోభన్‌బాబు



**కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి):** నగర పాలక సంస్థ డిప్యూటీ సిటీ ప్లానర్‌గా వి.శోభన్‌బాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన కార్పొరేషన్ కమిషనర్ ఎస్.రవీంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. విశాఖపట్నం మెట్రో రీజినల్ డెవలప్ మెంట్ అథారిటీలో పని చేస్తున్న ఆయనను పరిపాలన సౌలభ్యం కింద నగర పాలకకు బదిలీ చేశారు. 1987లో టౌన్‌ప్లానింగ్ బిల్డింగ్ ఆఫీసర్‌గా ఉద్యోగం చేరిన ఆయన 1998లో టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్‌గా, 2007లో టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్‌గా, 2010లో అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా, 2021లో డిప్యూటి సిటీ ప్లానర్‌గా పదోన్నతులు పొందారు. ఆముదాల వలస, పార్వతిపురం, అమలాపురం, పెద్దాపురం, తాడేపల్లిగూడెం మున్సిపాలిటీలతోపాటు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం కార్పొరేషన్‌లలో విధులు నిర్వహించారు. ఇక్కడ డిప్యుటేషన్‌పై పని చేస్తున్న సంధ్యారాణిపై ఆరోపణలు రావడంతో ఆమెను ప్రధాన కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం రెగ్యులర్ డీసీపీగా శోభన్ బాబు నియమి తులయ్యారు.







# ముగిసిన శివరాత్రి ఉత్సవాలు

### జగన్నాథగట్టుపై కన్నుల పండువగా రథోత్సవం

**కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి):** నగరంలో మహా శివరాత్రి ఉత్సవాలు గురువారం రాత్రి ముగిశాయి. గురువారం వివిధ దేవాలయాల్లో స్వామి, అమ్మవార్ల కల్యాణం, పల్లకీలలో ఊరే గింపు, శోభాయాత్రలు, రథోత్సవాలను నిర్వహించారు. నగర శివారులోని జగన్నాథ గట్టుపై వెలసిన ఉమా సహిత రూపాల సంగమేశ్వర స్వామి ఆలయంలో గురువారం రాత్రి రథోత్సవాన్ని నిర్వహించారు. స్థానిక దిన్నెదేవరపాడుతోపాటూ నగరం చుట్టుపక్కల ఉన్న వివిధ గ్రామాలకు భక్తులు పెద్ద సంఖ్యలో ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

● **హరిహర క్షేత్రంలో..** హరిహర క్షేత్రంలోని భవానీ సమేత రామలింగేశ్వర స్వామి వారికి మహా రుద్రాభిషేకం, అన్నాభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకులు ప్రసన్న, కె. మహేశ్‌శర్మ, గురురాజారావుల ఆధ్వర్యంలో పూజలు చేపట్టారు. అనంతరం స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ చేపట్టారు. అనంతరం రథోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సందేల్ చంద్రశేఖర్, చల్లా నాగరాజ శర్మ, గౌరవాధ్యక్షుడు సీవీ దుర్గాప్రసాద్, కంచుగంటల శ్యామసుందర రావు, మామిళ్లపల్లి రాజేశ్ శర్మ, గౌరవ సలహాదారు టీవీ రవిచంద్రశర్మ, కోశాధి కారి సీఎస్ ప్రసాద రావు, ఉప కార్యదర్శి నాగులవరం రాజశేఖర్‌రావు, సభ్యులు ఎస్. శ్రీనివా సరాజు, ఆనందరావు, ఆలయ మేనేజర్ రాధాకృష్ణ, శివన్న పాల్గొన్నారు.

● పాతనగరంలోని చిత్తారి వీధిలోని నిమిషాంబా దేవాలయంలో స్వామి అమ్మవార్ల రథోత్సవాన్ని గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు వెంకటేశ్ వర్మ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. పాతనగరంలోని శివాలయం, లలితాపీఠం, అశోక్‌నగర్‌లోని ద్వారకామాయి, కప్పల్‌న గర్‌లోని మల్లికార్జున స్వామి ఆలయం, సప్తగిరి నగర్‌లోని కైలాసగిరి తదితర శైవ దేవాలయాల్లో శివరాత్రి పూజలు, స్వామి అమ్మవార్ల కల్యాణం నిర్వహించారు.

**వైభవంగా నీలకంఠేశ్వరుడి రథోత్సవం**

**గూడూరు:** గూడూరులో భువనేశ్వరి నీలకంఠేశ్వర స్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. గురువారం మహా శివరాత్రి వేడుకల్లో భాగంగా ఆలయంలో స్వామి అమ్మవార్లకు అభిషేకం, కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం అశేష భక్త జనుల మధ్య రథాన్ని ఆలయం నుంచి అంజనేయస్వామి ఆలయం వరకు లాగారు. ఈసందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

● గూడూరు మండలం చనుగొండ్ల గ్రామంలో కేశవ నాగలింగేశ్వర బసవేశ్వర స్వామివారి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.

**కమనీయం.. స్వామి, అమ్మవార్ల కల్యాణం**

**కల్లూరు:** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కల్లూరు ఈశ్వర వీరభద్ర, భీమేశ్వరస్వామి ఆలయంలో స్వామి అమ్మవార్ల కల్యాణం కమనీయంగా సాగింది. గురువారం తెల్లవారు జామున జరిగిన స్వామి, అమ్మవార్ల కల్యాణానికి భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను గ్రామ వీధుల గుండా ఊరేగించి పల్లకీసేవ, నందికోలా సేవ కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ఈవో గురెడ్డి, చంద్ర శేఖరప్ప, నవీన్‌కుమార్, శంకరప్ప, వీరన్న, మహేంద్ర, పద్మనాభం, రాఘవేంద్ర, శేషసాయి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.


గూడూరులో రథోత్సవానికి హాజరైన జనం, హరిహర క్షేత్రంలో, శివపార్వతుల శోభాయాత్ర, చిత్తారి వీధిలో రథాన్ని లాగుతున్న భక్తులు


జగన్నాథ గట్టుపై రథాన్ని లాగుతున్న పోలీసులు, యువత


జగన్నాథగట్టుపై శివపార్వతులను పల్లకిలో ఊరేగిస్తున్న భక్తులు


కల్లూరు: స్వామి అమ్మవార్ల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

## భక్తిభావాన్ని అలవర్చుకోవాలి: ఎమ్మెల్యే గౌరు చరిత

**ఓర్వకల్లు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి):** ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని అలవర్చుకోవాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. కాల్వబుగ్గ రామేశ్వర స్వామి క్షేత్రంలో ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలకు ఎమ్మెల్యేతోపాటు నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి, టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు భక్తులకు మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ కాల్వబుగ్గ రామేశ్వరునికి ఎంతో పవిత్రతత ఉందని, ఆయన సన్నిధిలో ఇలాంటి కార్యక్ర మాలు చేపట్టడం శుభపరిణామమన్నారు. వర్షాలు బాగా పడి మంచి దిగుబడి రావాలని, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆ దేవున్ని ప్రారంభించామన్నారు.

● **అలరించిన సినీ సంగీత విభావరి:** కాల్వబుగ్గ రామేశ్వర స్వామి క్షేత్రంలో ఏర్పాటు చేసిన సినీ సంగీత విభావరి భక్తులను అలరించింది. ఎమ్మెల్యే గౌరు చరిత పాల్గొని సినీ సంగీత విభావరి కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అంతకుముందు ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు ఆలయ ఈవో మద్దిలేటి ఆలయ అర్చకులు కల్లె లక్ష్మీనా రాయణ శర్మ, లక్ష్మీనరసింహ శర్మలు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం సింగర్ మధుప్రియ, నంది అవార్డు గ్రహీత మహ్మద్ మియా, గాజువాక కండక్టర్ పొట్టి రమేష్, కాసుల కృష్ణారెడ్డి పాడిన పాటలు భక్తులను ఆకట్టుకున్నాయి. భక్తిపాటలు పాడుతుంటే యువకులు కేరిం తలు వేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కర్నూలు రూరల్ సీఐ చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులు, తహసీల్దార్ విద్యాసాగర్, నాయకులు గోవిందరెడ్డి చదువుల సుధాకర్ రెడ్డి, పునులూరు ప్రభాకర్ రెడ్డి, సుధాకర్, రాంభూపాల్ రెడ్డి, కేవీ మధు, రామగోవిందు, గొల్ల నాగరాజు, జయకృష్ణ, వేణు, బజారు, శేఖరప్ప, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


భక్తులనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరిత

## మత సామరస్యానికి చిహ్నం రోజా దర్గా

### నేటి నుంచి ఉరుసు


రోజా దర్గా

**కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి):** నగరంలో హిందూ ముస్లింల మతసామరస్యానికి ప్రతీక నిలిచే రోజా దర్గాలో 535వ ఉరుసు ఉత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభమవుతున్నాయి. మూడు రోజుల పాటు కొనసాగే ఈ వేడుకలకు స్థానిక భక్తులే కాకుండా మహారాష్ట్ర, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రల నుంచి వస్తారు. నిత్యం వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు విచ్చేసి దర్గాలో పూజలు చేసి, మొక్కులు తీర్చుకుం టారు. సుమారు 500 ఏళ్లపైగా ఘన చరిత్ర ఉన్న రోజా దర్గాలో మహిమాన్వితునిగా వినతికెక్కిన ముస్లిం గురువు, హజ్రత్ సయ్యద్ షా ఇస్హాక్ సనావుల్లా ఖాద్రి సమాధి అయ్యారు. శుక్రవారం రాత్రి 10 గంటలకు సందల్ ముఖద్దస్ కార్యక్రమంతో ప్రారంభమవుతాయని సయ్యద్ షా దాదాబాషా ఖాద్రి, దర్గా పీఠాధిపతి తెలిపారు. గంధోత్సవం పీఠాధిపతి ఇంటి నుంచి బయల్దేరి దర్గాకు ఊరేగింపుగా చేరుకుంటుం దని, శనివారం రాత్రి 10 గంటలకు హైదరాబాదుకు చెందిన ప్రముఖ కళాకారులతో ఖవ్వాలీ, బయాన్ కార్యక్రమాలు ఉంటాయని, ఆదివారం ఉదయం 9 గంటలకు జియారతె ఫాతెహా (మొక్కులు చెల్లింపు) ఉం టుందని ఆయన తెలిపారు.

## బెస్తలకు ఎమ్మెల్సీ సీటు కేటాయించాలి


మాట్లాడుతున్న సాయిప్రదీప్

**కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి):** ఎమ్మెల్యేల కోటాలో బెస్తలకు ఎమ్మెల్సీ సీటు కేటాయించాలని ఏపీ బెస్త సంఘం రాష్ట్ర కో-కన్వీనర్ పీటీ సాయిప్రదీప్ కోరారు. గురువారం స్థానిక బిర్లా కాంపౌండులో ఏపీ బెస్త సంఘం ఆధ్వర్యంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బెస్తలు ఇంత వరకు చట్టసభల్లో అడు గు పెట్టలేదన్నారు. రాష్ట్ర చైర్మన్లు గానీ రాష్ట్ర స్థాయి డైరెక్టర్లు పోస్టులలో అవకాశం కల్పించలేదన్నారు. అలాగే రాష్ట్ర బెస్త ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయలేదన్నారు. రాయలసీమ ఇన్‌చార్జి మిడుతూరి శ్రీనివాసులు, బెస్త సాధికార కమిటీ జిల్లా అధ్యక్షుడు పీజీ వెంకటేశ్, పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి


వసతి గృహాన్ని పరిశీలిస్తున్న ఉపకులపతి

**కర్నూలు అర్బన్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి):** హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఉపకులపతి ప్రొఫెసర్ వి.వెంకట బసవరావు ఆదేశించారు. గురువారం రాయలసీమ యూనివర్సిటీలోని బాలురు, బాలికల వసతి గృహాలను రెక్టార్‌తో కలిసి పరిశీలించారు. వంట గదిలో భోజనాల తయారీ ప్రక్రియను పరిశీలించి శుభ్రత పాటిం చాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న సివిల్, ఎలక్ట్రికల్ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచు కొని తాగునీటి కొరత లేకుండా చూడాలన్నారు.

## ముగిసిన అన్నదానం

**కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి):** శ్రీశైలంలోని అఖిల భారత కురువ వంశ నిత్యాన్నదాన సత్రం కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 23 నుంచి నిర్వహించిన అన్నదాన కార్యక్రమం గురువారం ముగిసినట్లు సత్రం కమిటీ అధ్యక్షుడు కె.రంగస్వామి, ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాసులు తెలిపారు. చివరి రోజున నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య, ఉమ్మడి జిల్లా గొర్రెల సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు, డైరెక్టర్ యుగంధర్ సత్రాన్ని సందర్శించి భక్తులకు భోజనాలు వడ్డించారన్నారు. తలముడిపి కురువ మల్లయ్య, పర్ల మల్లికార్జున, చిన్న నాగన్న, నీలన్న, లడ్డూ రామన్న అన్నదాన కార్యక్రమానికి సహకరించినట్లు వారు తెలిపారు.

## అవకతవకలను అరికట్టాలి: ఎస్ఎఫ్ఐ

**కర్నూలు అర్బన్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి):** ప్రతి విద్యాసంవత్సరం గుర్తింపు సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియలో అవకతవకలను అరికట్టాలని ఎస్ఎఫ్ఐ కన్వీనర్ రామక్రిష్ణ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గురు వారం రాయలసీమ యూనివర్సిటీ రిజిస్ట్రార్ బోయ విజయకుమార్‌ను కోరారు. గతతంలో ఉన్న అధికారులతో కళాశాల యాజమాన్యాలు కుమ్మకై నిబంధనలు బేఖాతర్ చేస్తూ కళాశాల్లోనే సర్టిఫికెటను పరిశీలన చేయించారన్నారు. ఈవిద్యా సంవత్సరం సర్టిఫికెట్ల వెరిఫికేషన్ వర్సిటీ లోనే నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్ర మంలో కో కన్వీనరు మౌళాలి, సాగర్, యాదవ్ పాల్గొన్నారు.

## ఆంజనేయస్వామికి అమావాస్య పూజలు

**ఓర్వకల్లు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి):** మండలంలోని కొమ్ముచెరువు, కాల్వ, భైరాపురం తదితర గ్రామాల్లో వెలసిన ఆంజనేయస్వామి ఆలయాల్లో గురువారం అమావాస్యను పురస్కరించుకుని భక్తులు పోటెత్తారు. కొమ్ముచెరువు ఆంజనేయస్వామి ఆలయానికి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు హాజరై స్వామివారికి ఆకుపూజలు చేశారు.

## నీళ్లు రావు..పన్నులు ఎలా పెంచుతారు?

● అనధికార కొళాయి కనెక్షన్లు రెగ్యులరైజ్ చేయండి
● పనులు చేయని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టండి
● వాడీవేడిగా నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం


కమిషనర్‌ను ప్రశ్నిస్తున్న వైస్ చైర్మన్ పీఎస్ అస్లాం

**గూడూరు ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి):** కొళాయిలకు నీరు ఎప్పుడు వస్తుందో తెలియడం లేదు.. కాని పన్నులు మాత్రం పెంచుతారా అంటూ నగర పంచాయతీ వైస్ చైర్మన్లు పీఎస్ అస్లాం, లక్ష్మన్న కమిషనర్ రమేష్ బాబును ప్రశ్నించారు. గురువారం గూడూరు నగర పంచాయతీ కార్యాల యంలో చైర్మన్ జులు పాల వెంకటేశ్వర్లు అధ్యక్షతన నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం జరిగింది. సమావేశం ప్రారంభం కాగానే మేనేజర్ విజయలక్ష్మీ ఆజెండాలోని అంశాలను చదివి వినిపించారు. నగర పంచాయతీ పరిధిలో అనధికార కొళాయిలు చాలా ఉన్నాయని ముందు వాటిని రెగ్యులరైజ్ చేసి ఆ తర్వాతే నీటి పన్ను పెంచాలని వైస్ చైర్మన్ పీఎస్ అస్లాం కమిషనర్‌కు సూచించారు. కొళాయిలను నీళ్లు రావు పన్నులు ఎలా పెంచుతారని కౌన్సిలర్ పద్మావతి కమిషనర్‌ను ప్రశ్నించారు. కౌన్సిలర్ రత్నమ్మ మాట్లాడుతూ బోరు చెడి పోయి కాలనీవాసులు ఇబ్బందులు పడుతుంటే దానికి మరమ్మతులు చేయించాలన్నారు. కమిషనర్ రమేష్ బాబు మాట్లాడుతూ నీటి పెంపుపై జీవో వచ్చిందని అక్రమ కొళాయి కనెక్షలను రెగ్యులరైజ్ చేస్తామని, అలాగే నీటి సమస్యను పరిష్కరించి పన్నులు పెంచుతామన్నారు. పనులు చేయని కాంట్రాక్టర్లకు నోటీసులు ఇచ్చి బ్లాక్ లిస్టులో పెంటాలని వైస్ చైర్మన్ అస్లాం కమిషనర్‌కు సూచించారు. రోడ్డు విస్తరణ చేపట్టాలని అదే సమయంలో అక్రమంగా నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్స్, అక్రమ లే అవుట్‌పై చర్యలు తీసుకోవాలని కోఆప్షన్ సభ్యుడు పి రామాంజనేయులు కమిషనర్‌కు సూచించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ రామాంజనేయులు, విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస నాయక్, మేనేజర్ విజయలక్ష్మి, టౌన్ ప్లానింగ్ అధికారి గోపాల కృష్ణ, ఏఈ కృపాకర్, కౌన్సిలర్ దస్తగిరి, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

## వాటర్ షెడ్లతో పేద రైతులకు లబ్ధి: పీడీ


సహజ వనరుల పటాన్ని చూపుతున్న డ్వామా పీడీ

**ఓర్వకల్లు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి):** వాటర్ షెడ్ పథకంతో పేద రైతులకు లబ్ధి చేకూరుతుందని డ్వామా పీడీ వెంకటరమణ అన్నారు. బుధవారం మండలంలోని హుశేనాపురం లోని జడ్పీ ఉన్నత పాఠశాలలో వాటర్‌షెడ్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, సభ్యులు, రైతులతో బహిరంగ సభ నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా పీడీ వెంకటరమణ, అడిషనల్ పీడీ మాదవీలత హాజరయ్యారు. ఈ సభకు సర్పంచ్ చంద్ర గోవర్ధనమ్మ అధ్యక్షత వహించారు. పీడీ మాట్లాడుతూ సన్న చిన్న కారు రైతుల సంక్షేమం కోసమే కేంద్ర ప్రభుత్వం వాటర్ షెడ్ పథకాన్ని ప్రవేశ పెట్టిందన్నారు. వాటర్‌షెడ్ పథకంపై రైతులకు అవగా హన కల్పించారు. వాటర్‌షెడ్ పథకం కింద మండలంలోని గుట్టపాడు, ఓర్వకల్లు, శకునాల, తిప్పాయపల్లె, కాల్వ, హుశేనాపురం గ్రామాలను ఎంపిక చేశామన్నారు. అనంతరం సహజ వనరుల పటాన్ని చూపుతూ రైతులకు అవగాహన కల్పించారు. జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వాటర్‌షెడ్ పథకంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఆఫీసర్ శ్రీధర్ రెడ్డి, సర్పంచ్ మోహన్ రెడ్డి, జేఈ అయూబ్ బాషా, ఏపీడీ లక్ష్మన్న, క్రిష్ణమోహన్, ఎంపీడీవో శ్రీనివాసులు, కోర్సు డైరెక్టర్ నాగ ఎర్ర మల పాల్గొన్నారు.

## సీ.క్యాంపు రైతుబజారులో క్లీన్ అండ్ గ్రీన్

**కర్నూలు అగ్రికల్చర్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి):** సీ.క్యాంపు రైతుబజారులో గురువారం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించినట్లు ఇన్‌చార్జి ఎస్టేట్ అధికారి శివకుమార్ తెలిపారు. రైతు బజార్‌లో కాలువలను శుభ్రం చేయడంతోపాటు పేరుకుపోయినా చెత్తాచెదారాన్ని తొలగించారు. కార్యక్రమంలో సెక్యూరిటీ గార్డులు శ్రీనివాసరెడ్డి, గురువయ్య, గోపాల్, హనుమంతు, చిన్నస్వామి పాల్గొన్నారు.

## ఎస్‌బీ ఏఎస్ఐపై దాడి

**కర్నూలు క్రైం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి):** మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో నంద్యాల చెక్‌పోస్టు వద్ద గురువారం రాత్రి ఎస్‌బీ ఏఎస్ఐ మాధవ రెడ్డిపై దాడి జరిగింది. కొంత మంది ఆకతాయిలు అల్లరి చేస్తుండగా.. అటుగా వస్తున్న మాధవరెడ్డి రోడ్డుపై అల్లరి ఎందుకు అని పక్కకు వెళ్లాలని తెలిపారు. దీంతో రెచ్చిపోయిన ఆకతాయిలు రాయి తీసుకుని మాధవరెడ్డి తలపై కొట్టారు. దీంతో మాధవరెడ్డి తలకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన మాధవ రెడ్డిని చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేర్పించారు. త్రీటౌన్ సీఐ శేషయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఘటనకు కారకుడైన ఓ యువకున్ని అదుపులోకి తీసుకున్నారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలి పారు.

## రాజీవ్‌నగర్‌లో చోరీ

**కర్నూలు క్రైం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి):** నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో బళ్లారి చౌరస్తా సమీ పంలో రాజీవ్‌నగర్‌లో చోరీ జరిగింది. మైనార్టీ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేసే అన్సారీ రెండు రోజుల క్రితం ఊరు వెళ్లాడు. గురువారం తిరిగి వచ్చి చూస్తే ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయి, బీరువాలో ఉన్న రూ.4 లక్షలు నగదు, కొంత బంగారు, వెండి నగలు మాయమైనట్లు గుర్తించారు. దీంతో బాధితుడు పోలీసులు ఆశ్రయిం చాడు. పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

## సామూహిక ఇంకుడు గుంతలకు ప్రతిపాదనలు

**కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి):** జిల్లాలోని అన్ని గ్రామాలలో సామూహిక ఇంకుడు గుంతలు తీసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు గురువారం తెలిపారు. ప్రతి గ్రామంలో వర్షపు నీటిని నిల్వ చేసేందుకు కావాల్సిన ఇంకుడు గుంతలకు సంబంధించి ప్రతిపాద నలు సిద్ధం చేయాలని ఉన్నతా ధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయ న్నారు.

## హమాలీల ధర్నా

**కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి):** సివిల్ సప్లైస్ హమాలీలకు కొత్త కూలి రేట్ల జీవోను విడుదల చేయాలని హమాలీ యూనియన్ అధ్వర్యంలో చేస్తున్న ధర్నా గురువారానికి ఏడో రోజుకు చేరింది. నగరంలోని ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద చేపట్టిన ధర్నాలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ మాట్లాడుతూ కూలీల రేట్లు పెరిగి 14 నెలలు అవుతున్న ప్రభుత్వం కాలయాపన చేస్తుందన్నారు. సోలోమన్ రాజు, శివ, వినయ్, ప్రకాష్, రమేష్ పాల్గొన్నారు.

## విధుల్లో చేరిన ఆర్ఐ

**సి.బెళగల్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి):** సి.బెళగల్ ఆర్ఐగా తరుణ్ గురువారం విధుల్లో చేరినట్లు తహసీల్దార్ పురుషోత్తం తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలానికి గతంలో ఇద్దరు ఆర్ఐలు ఉండేవారని, అయితే ప్రభుత్వం మండలానికి ఒక్కరిని మాత్రమే నియమించినట్లు తెలిపారు. కర్నూలు కలెక్టర్ కార్యాలయంలో విధుల నిర్వహిస్తున్న తరుణ్‌ను సి.బెళగల్ ఆర్ఐగా నియమించినట్లు తెలిపారు.

## పొలాల్లో విద్యుత్ స్తంభాలు వేయరాదు

**గూడూరు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి):** గూడూరు పట్టణంలో రైతుల అనుమతి లేకుండా పొలాల్లో ప్రైవేట్ కంపెనీలు విద్యుత్ స్తంభాలు వేయ రాదని సీఐటీయూ డివిజన్ కార్యదర్శి జె మోహన్ అన్నారు. గురువారం గూడూరులో జె మోహన్ ఆధ్వర్యంలో రైతులు తహసీల్దార్ రామాంజనే యులుకు వినతిపత్రం అందజేశారు.

## 2న స్విమ్మింగ్ పూల్ పునఃప్రారంభం

**కర్నూలు స్పోర్ట్స్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి):** నగరంలోని కిసాన్‌ఘాట్ డీఎస్ఏ స్విమ్మింగ్ పూల్ మార్చి 2న పునఃప్రారంభిస్తున్నట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు గురువారం తెలిపారు. వేసవి కారణంగా ఉదయం 6 నుంచి 9 గంటల వరకు సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు స్విమ్మింగ్ కోసం సమయం కేటాయించామన్నారు. సభ్యత్వం కోసం చిన్నారులు ఆరేళ్లు పూర్తయి ఉండాలన్నారు. ఆసక్తిగల వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు



కార్యకర్తలతో మాట్లాడుతున్న గిరి మల్లేష్ గౌడ్

**ఆలూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి):** టీడీపీ ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తోందని టీడీపీ నాయకుడు గిరి మల్లేష్ గౌడ్ అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో నాయకులతో సమావేశమయ్యారు. హౌసింగ్ స్కీమ్ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సాయంపై ప్రజలకు అవగాహన కల్పించి ఇల్లు నిర్మించుకునేలా చూడాలన్నారు. అనంతరం ఇబ్రహీం ఫంక్షన్ హాల్‌లో జూనియర్ ఎన్‌టీఆర్ అభిమాన సంఘం అధ్యక్షుడు డా. నెట్టప్ప కుమారుడు రిసెప్షన్‌కు హాజరయ్యారు. ఆయన వెంట టీడీపీ నాయకులు సురేంద్ర, వన్నూరు వల్లి, నరసప్ప, ముద్దురంగ, వెంకన్న, రామాంజినేయులు పాల్గొన్నారు..

## పైప్‌లైన్లను పాడుచేయొద్దు : ఎమ్మెల్యే



హంద్రీ నీవా నీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్యాంబాబు

**పత్తికొండ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి):** హంద్రీనీవా పైప్‌లైన్లను పాడుచేయొద్దని ఎమ్మెల్యే శ్యాంబాబు కోరారు. గురువారం పత్తికొండ సమీపంలో బుగ్గవంక ద్వారా ప్రవహిస్తున్న హంద్రీనీవా నీటిని పరిశీలించారు. క్రిష్ణగిరి మండలం ఆలంకొండ వద్ద ఏర్పాటు చేసిన ఎత్తిపోతల నుంచి మూడు ప్రాంతాల చెరువులకు నీటిని నింపేందుకు పైపులైన్లను ఏర్పాటు చేశామన్నారు. చాలచోట్ల రైతులు, గొర్రెలకాపర్లు నీటి అవసరాలకు పైప్‌లైన్లకు రంధ్రాలు చేస్తుండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. అలా చేస్తే మరమ్మతులకే సమయం సరిపోతుందన్నారు. చెరువులు నిండితే పొలాలకు సాగునీరు అందుతుందని, భూగర్భజలాలు పెరుగుతాయని, తాగునీటి ఇబ్బందులు తీరుతాయని గుర్తించాలన్నారు. టీడీపీ నాయకులు బత్తిని వెంటకట్రాముడు, ప్రమోద్ కుమార్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, వెంకటపతి, సోమ్లానాయక్ తదితరులు ఉన్నారు.

## రీ సర్వేతో శాశ్వత పరిష్కారం

● జాయింట్ కలెక్టర్ బి.నవ్య



రికార్డులను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ నవ్య

**మద్దికెర, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి):** రీ సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య తెలిపారు. గురువారం మండలంలోని బొమ్మనపల్లి గ్రామంలో ల్యాండ్ సీలింగ్ భూములను పరిశీలించారు. రైతులు, సర్వేయర్లతో ఆమె మాట్లాడుతూ రైతులు, భూ యజమానులకు రీ సర్వేపై ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. రైతుల సమక్షంలో కొలతలు వేసి హద్దులు నిర్వహించాలని, రైతులకు ముందుగా సమాచారం కూడా ఇవ్వాలని ఆదేశించారు. పైలెట్ గ్రామంగా పెరవలిని ఎంపిక చేశామని, గ్రామంలో 6వేల ఎకరాల రీసర్వే చేస్తున్నామన్నారు. బొమ్మనపల్లి గ్రామంలోని సీలింగ్ భూములు 99 ఎకరాలు ఉన్నాయని, యజమానులు కోర్టుకు వెళ్లారన్నారు. వీఆర్వోలు గ్రామాల్లో అందుబాటులో ఉండాలని సూచించారు. అభ్యంతరం లేని ప్రభుత్వ స్థలాల్లో 2019లోపు భవనాలు నిర్మించుకుని ఉంటే స్థానిక సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే పట్టాలు ఇస్తారన్నారు. ఆర్డీవో భరత్ నాయక్, తహసీల్దార్ హుశేన్ సాహెబ్, ఆర్ఐ రవికుమార్, వీఆర్వోలు రంగస్వామి, రషీద్, సర్పంచ్ ఆంజనేయులు ఉన్నారు.

## ఆజాద్ అడుగు జాడల్లో నడుద్దాం



మాట్లాడుతున్న అంజయ్ కుమార్

**ఆదోని అగ్రికల్చర్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి):** స్వాతంత్ర్య సమరయోధుడు చంద్రశేఖర్ ఆజాద్ అడుగుజాడల్లో నడుద్దామని బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి అంజయ్ కుమార్ అన్నారు. గురువారం చంద్రశేఖర్ ఆజాద్ వర్ధంతిని బీసీ హాస్టల్‌లో నిర్వహించారు. శివ, నరసింహ, ఈశ్వర్, రవిశంకర్, నాగరాజు, కాశీ విశ్వనాథ్ కుమార్ పాల్గొన్నారు.



# విద్యార్థులతో చెలగాటం

- బూజుపట్టిన కూరగాయలతో వంట
- చాలీచాలని అన్నం, చారు
- హొళగుంద కస్తూర్బా పాఠశాల విద్యార్థినుల అవస్థలు



వాడిన క్యాబేజీ, ఇన్‌సెట్‌లో బెండకాయలు

**హొళగుంద, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి):** కస్తూర్బా హాస్టల్ విద్యార్థుల ఆరోగ్యంతో కాంట్రాక్టర్, ఎస్‌వో ఆటలాడుతున్నారు. ఉడికీ ఉడకనం అన్నం, బూజు పట్టిన కూరగాయలతో వంట చేసి పెడుతున్నారు. హొళగుంద కస్తూర్బా పాఠశాలను గురువారం ఆంధ్రజ్యోతి ప్రతినిధి పరిశీలించగా విస్తుపోయే దృశ్యాలు కనిపించాయి. ఇక్కడ 210మంది విద్యార్థినులు 6 వతరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్నారు. గురువారం 200మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం తయారు చేశారు.

**తక్కువ మొత్తంలో ఆహారం**

210 మంది విద్యార్థినులకు సరిపోయేలా వంటచేసి పెట్టాల్సిన నిర్వాహకులు తక్కువ మొత్తంలో ఆహారం ఇస్తున్నట్లు తెలుస్తోంది. గురువారం చిన్న పాత్రలో చారు తయారుచేశారు. అలాగే ఉడికీ ఉడని అన్నం పెట్టినట్లు విద్యార్థినులు ఆరోపిస్తున్నారు.

**ఆగ్రహం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు**

నాసిరకమైన భోజనం పెడుతున్నారని గతంలోనే అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తల్లిదండ్రులు అంటున్నారు. వారు చూసీ చూడనట్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి.

● ఈ విషయపై కేజీబీవీ ఎస్‌వో బిందు మాధవిని వివరణ కోరగా, కూరగాయల కాంట్రాక్టర్‌పై ఇప్పటికే ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. మరోసారి ఇలా జరగకుండా చూస్తామని తెలిపారు.

### బూజుపట్టిన క్యారెట్‌తో వంట



కూరగాయల గదిని పరిశీలించగా కుళ్లిన బెండకాయలు, పురుగులు పట్టిన క్యాబేజీ, నాసిరకం ఉల్లిగడ్డలు కనిపించాయి. అయితే వంట నిర్వాకులు బూజుపట్టిన క్యారెట్, బీట్‌రూట్‌తోనే క్రరీ చేశారు. నాసిరకంగా టమోటా రసం చేశారు. గత్యంతరం లేక భోజనం చేశామని విద్యార్థినులు వాపోయారు.

## సారా స్థావరాలపై దాడులు

**ఆదోని, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి):** పట్టణ శివారులోని రణమండల కొండల్లో నాటుసారా స్థావరాలపై ఎక్సైజ్ సీఐ సైదుల్లా సిబ్బందితో గురువారం దాడులు నిర్వహించారు. 750 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న నిర్వాహకులు ముందుగానే పరారయ్యారు. వాల్మీకి నగర్‌కు చెందిన బోయ లాలుస్వామితోపాటు బోయ రవి అనే ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు.

## రైతులకు గుర్తింపు కార్డులు తప్పనిసరి

**దేవనకొండ,ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి):** ప్రభుత్వ పథకాలు పొందాలంటే రైతులకు గుర్తింపు కార్డులు తప్పనిసరని ఏవో సురేష్‌బాబు సూచించారు. గురువారం మాట్లాడుతూ మండలంలో ఇంకా 5 వేల మంది రైతులు గుర్తింపు కార్డులు చేయించుకోలేదన్నారు. సమీప రైతుసేవా కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు.

## సంచార చికిత్స కేంద్రం తనిఖీ



మందులను తనిఖీ చేస్తున్న రఘు

**వెల్దుర్తి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి):** బ్రహ్మగుండంలో శివరాత్రి సందర్భంగా ఏర్పాటుచేసిన సంచార చికిత్స కేంద్రాన్ని నోడల్ అధికారి రఘు గురువారం తనిఖీ చేశారు. వైద్య సేవలను పరిశీలించారు. వైద్యాధికారి భువనతేజ, హెల్త్ సూపర్‌వైజర్ మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

## వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

**మద్దికెర, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి):** ప్రభుత్వ పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఎంఈవో రంగస్వామి సూచించారు. గురువారం పెరవలి జడ్పీ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేయాలన్నారు

## ఇంటింటి ఆరోగ్య సర్వే పూర్తి చేయాలి



సూచనలు ఇస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో రఘురామి రెడ్డి

**ఆలూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి):** ఇంటింటి ఆరోగ్య సర్వేను మార్చి చివరికి పూర్తి చేయాలని పత్తికొండ డివిజన్ డిప్యూటీ డీఎంహెచ్‌వో రఘురామి రెడ్డి సూచించారు. గురువారం సచివాలయం-2లో వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి క్యాన్సర్, బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులను గుర్తించి నమోదు చేయాలన్నారు. హెల్త్ ఆర్గనైజర్ ఆంధ్రూస్ పాల్గొన్నారు..

## సొసైటీ అభివృద్ధికి సహకరించాలి

**తుగ్గలి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి):** రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో రుణాలు చెల్లించి సొసైటీ అభివృద్ధికి సహకరించాలని మారెళ్ల సొసైటీ ఛైర్మన్ అశోక్ కుమార్ కోరారు. గురువారం మండలంలోని పెండేకల్ ఆర్‌ఎస్‌లో, అశోక్ రైతులతో మాట్లాడుతూ కనీసం వడ్డీ కూడా కట్టకపోతే మొండి బకాయిల కింద నమోదు చేసి నోటీసులు అందించి ఆస్తులను జప్తు చేయాల్సి వస్తుందన్నారు. సొసైటీ సీఈవో మనోహర్ నాయుడు, సిబ్బంది మధు ఉన్నారు.

## క్రీడలతో మానసికోల్లాసం

**వెల్దుర్తి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి):** క్రీడలతో మానసికోల్లాసం వస్తుందని ఎస్సీ బాలుర వసతి గృహం వార్డెన్ ఉస్మాన్ తెలిపారు. హాస్టల్‌కు క్రీడా సామగ్రి మంజూరైందన్నారు. క్రికెట్ కిట్టు, వాలీబాల్, టెన్నికాయిట్, చెస్, క్యారమ్స్, షార్ట్‌పుట్, త్రోబాల్ కిట్లు ఉన్నాయన్నారు.

# కమనీయంగా రథోత్సవం... కల్యాణం



తుగ్గలి: బోడిబండలో రథోత్సవం



వెల్దుర్తి టౌన్: బ్రహ్మగుండంలో కల్యాణం



దేవనకొండ: పల్లెదొడ్డి శివాలయంలో కల్యాణోత్సవం

**ఆదోని, పత్తికొండ, ఆలూరు నియోజవర్గాల్లో శివరాత్రి సందర్భంగా రథోత్సవం, కల్యాణం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.**

**వెల్దుర్తి టౌన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి):** బ్రహ్మగుండంలో శ్రీదేవి భూదేవి సమేత బ్రహ్మగుండేశ్వర స్వాముల కల్యాణం చేశారు. ఉత్సవమూర్తులను మేళతాళాలు, భాజాభజంత్రీలతో ఊరేగించి, వేదిక వద్దకు తెచ్చారు. అనంతరం రాత్రి 12.10గంటలకు కల్యాణం చేశారు. శుక్రవారం సాయంత్రం రథోత్సవం నిర్వహిస్తున్నట్లు ఈవో తెలిపారు.

**మద్దికెర:** బుగ్గ సంగమేశ్వరుని రథోత్సవం వైభవంగా నిర్వహించారు. గురువారం తెల్లవారు జామున బుగ్గ సంగమేశ్వరుని కళ్యాణోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం మూలవిరాట్ బుగ్గ సంగమేశ్వర స్వామికి అభిషేకాలు, మహామంగళ హారతి, పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులకు మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తులను రథంలో ఉంచి రథోత్సవాన్ని నిర్వహించారు.

● మండలంలోని ఎం.అగ్రహారం గ్రామ శివారుని కొండప్పస్వామి రథోత్సవం వైభవంగా సాగింది. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం రథం ముందు హోమాన్ని నిర్వహించి పూజలు చేశారు. అనంతరం భక్తులు రథాన్ని ముందుకు లాగారు.



వెల్దుర్తి టౌన్: బ్రహ్మగుండంలో పాల్గొన్న మహిళలు

**క్రిష్ణగిరి:** మండలంలోని చుంచు ఎర్రగుడి, లక్కసాగరం, కంభాలపాడు గ్రామాల్లో శివ పార్వతుల కల్యాణం నిర్వహించారు. లక్కసాగరం గ్రామంలో ధర్మకర్తలు టీడీపీ నాయకులు లక్కసాగరం లక్ష్మిరెడ్డి, రామక్రిష్టారెడ్డి ఆధ్వర్యంలో ఉమా, మహేశ్వర స్వామి కళ్యాణం నిర్వహించారు. చుంచు ఎర్రగుడి గ్రామంలోనూ నిర్వహించారు.

**పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే**

చుంచు ఎర్రగుడి గ్రామంలో పార్వతిదేవి సమేత రామలింగేశ్వర స్వామికి పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు పూజలు నిర్వహించారు. అనంతరం బండలాగుడు, కబడ్డీ పోటీలను ప్రారంభించారు.

**తుగ్గలి:** మండలంలోని చెన్నంపల్లిలో ఉదయం శివపార్వతుల కల్యాణోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. అలాగే బోడి బండలోల తిమ్మగురుడు, పక్కీరప్ప స్వాముల విగ్రహాలను రథంపై ఏర్పాటు చేసి ఊరేగించి కల్యాణం చేశారు. సాయంత్రం కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ భక్తుల మధ్య రథోత్సవం నిర్వహించారు. పత్తికొండ రూరల్ సీఐ పులిశేఖర్, జొన్నగిరి ఎస్ఐ జయశేఖర్ బందోబస్తు నిర్వహించారు. ధర్మకర్తలు అప్పా వేణుగోపాల్, సుదర్శన్ రెడ్డి, సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు గౌడు, వసుల శ్రీరాములు, విశ్వనాథ్ భక్తులు పాల్గొన్నారు.

**ఆస్పరి:** బినిగెర గ్రామం పంచలింగేశ్వర ఆలయంలో, ఆస్పరి పకీరప్ప తాత ఆలయంలో పూజలు నిర్వహించారు. సాయంత్రం పకీరప్ప తాతకు కుంభాభిషేకం, రథోత్సవం నిర్వహించారు. శ్రీనివాస్ నాయున, తిమ్మగురుడు పెద్ద పకీరప్ప, చిన్న పకీరప్ప, శేషాద్రి నాయుడు, ఈరన్న, నారాయణ, ధరణి పాలొన్నారు.



మద్దికెర : ఎం. అగ్రహారంలో రథోత్సవం

**తుగ్గలి:** అన్నదానం గొప్పదని టీడీపీ నాయకుడు హైదరాబాదు శ్రీరాములు, ఈశ్వరమ్మ అన్నారు. గురువారం బోడిబండలో భక్తులకు అన్నదానం చేశారు. 20 ఏళ్ల నుంచి అన్నదానం నిర్వహిస్తున్నామన్నారు.

**దేవనకొండ:** శివరాత్రి వేడుకలలో భాగంగా గురువారం కల్యాణం నిర్వహించారు. మండలంలోని పల్లెదొడ్డి, కరివేముల, పి.కోటకొండ, దేవనకొండ తదితర గ్రామాల్లో తెల్లవారుజామునే నిర్వహించారు.

## వంద శాతం వసూలు చేయాలి

**పత్తికొండ టౌన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి):** మార్చి 15వ తేదీలోపు ఇంటి పన్నులను వంద శాతం వసూలు చేయాలని డీఎల్‌పీవో వీరభద్రప్ప పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఈవోఆర్‌డీ నరసింహులుతో కలిసి సమావేశం నిర్వహించారు. వేసవిలో తాగునీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. కార్యదర్శులు, సర్వేయర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు సర్వేలో పాల్గొంటారని, సర్వేకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రామకృష్ణ, హుశేన్‌సాహేబ్, ఇంద్రాణి తదితరులు పాల్గొన్నారు.

## సారా తయారీ మానుకోవాలి

**ఆలూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి):** సారా తయారీ వృత్తిని మానుకోవాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎక్సైజ్ సీఐ లలిత సూచించారు. గురువారం కొత్తపేట గ్రామంలో ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు నవోదయం ర్యాలీ నిర్వహించారు. సారా తయారీ, విక్రయాలను మానుకుంటే ప్రభుత్వం స్వయం ఉపాధి పొందేందుకు అవకాశం ఇస్తుందన్నారు.

## హమాలీ కూలి రేట్లు పెంచాలి



ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న హమాలీలు

**పత్తికొండ టౌన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి):** సివిల్ సప్లయ్ హమాలీల కూలి రేట్లను విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు వెంకటేశ్వరరెడ్డి, మండల కార్యదర్శి గోపాల్ డిమాండ్ చేశారు. గురువారం ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, ఆర్డీవో భరత్ నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. కూలి పెంచుతామని కూటమి హామీ ఇచ్చిందన్నారు. దస్తగిరి,హమాలీ యూనియన్ నాయకులు హుశేన్, శ్రీరాములు, రాము, మల్లికార్జున, సురేంద్ర ఆచారి, కేశవులు తదితరులు పాల్గొన్నారు.

## డీఏ చెల్లింపులో జాప్యం తగదు

**ఆదోని అగ్రికల్చర్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి):** ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ డీఏల చెల్లింపులో ప్రభుత్వ జాప్యం తగదని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్. గోకారి ప్రధాన కార్యదర్శి టీకే జనార్ధన్ విమర్శించారు. శుక్రవారం ఎమ్మార్సీ భవనం వద్ద మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు గుడుస్తున్నా జాప్యం చేస్తోందన్నారు. 12వ పీఆర్సీని నియమించి 30శాతం ఐఆర్‌ను ప్రకటించాలనిడిమాండ్ చేశారు. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. షణ్ముర్తి, షఫీ, సుంకన్న, రామ్మోహన్ రెడ్డి, వీర చంద్ర యాదవ్, రమేష్ నాయుడు, నాగేంద్రప్ప, మహాదేవప్ప, ఎంసీ సుంకన్న, నారాయణ, రామకృష్ణ ఉన్నారు.



మాట్లాడుతున్న గోకారి

## జగనన్న కాలనీలో అనర్హులను గుర్తిస్తాం

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

● పత్తికొండ తహసీల్దార్ రమేష్



**పత్తికొండ టౌన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి):** మండలంలో జగనన్న కాలనీ లేఅవుట్లలో విచారణ చేసి అనర్హులను గుర్తించి పట్టా రద్దుకు సిఫారసు చేస్తామని పత్తికొండ తహసీల్దార్ రమేష్ తెలిపారు.

**ప్రశ్న:** పత్తికొండ మండలంలో ఎన్ని జగనన్న లేఅవుట్లు ఉన్నాయి? ఎంతమందికి పట్టాలు ఇచ్చారు..?

**జవాబు:** మండలంలోని గ్రామ పంచాయతీల్లో జగనన్న లేఅవుట్ల కింద 1,516 మందికి పట్టాలు ఇచ్చాం.

**ప్రశ్న:** జగనన్న కాలనీపై ఎందుకు విచారణ చేస్తున్నారు.?

**జవాబు:** గత ప్రభుత్వం జగనన్న కాలనీ లేఅవుట్లు ఏర్పాటు చేసి పట్టాలు ఇచ్చింది. అయితే ఇందులో అనర్హులకు స్థలాలు ఇచ్చారని పిర్యాదులు వచ్చాయి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ చేసి లేవుట్లలో అనర్హుల పట్టాలు రద్దు చేస్తాం. కాలనీల్లోని ఖాళీ స్థలాల వివరాలను ఉన్నతాధికారులకు నివేది ఇస్తాం

**ప్రశ్న:** విచారణ ప్రారంభించారా?

**జవాబు:** ఈ నెల 17 నుంచి విచారణ ప్రారంభించాం. నెలాఖరు వరకు చేస్తాం. సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తాం.

**ప్రశ్న:** రీసర్వే పైలట్ ప్రాజెక్టు కింద ఏ గ్రామం ఎంపికైంది?

**జవాబు:** మండలంలోని జూటూరు రెవెన్యూ గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశాం. గత సర్వేలోని పొరపాట్లు పునరావృతం కాకుండా సమగ్రంగా సర్వే చేస్తాం.

**ప్రశ్న:** రీసర్వేలో ఎన్ని టీంలు పాల్గొంటున్నాయి?

**జవాబు:** మూడు బృందాలతో రీసర్వే చేస్తున్నాం. ఒక్కో టీం రోజుకు 20 ఎకరాల చొప్పున సర్వే చేస్తోంది. జూటూరు రెవెన్యూ పరిధిలో 7వేల ఎకరాలకు గానూ ఇప్పటికే 2వేల ఎకరాలు రీసర్వే పూర్తిచేశాం.

**ప్రశ్న:** మండలంలో ఎన్ని రేషన్ దుకాణాలు ఉన్నాయి?

**జవాబు:** 41 చౌకదుకాణాలు ఉండగా సుమారు 20వేల రేషన్ కార్డులు ఉన్నాయి. ప్రతి నెలా ప్రభుత్వం సబ్సిడీ కింద బియ్యం, చక్కెర, కందిపప్పును అందిస్తుంది.

## మంత్రి పర్యటన ఏర్పాట్ల పరిశీలన



హెలిప్యాడ్ మైదానాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి

**మంత్రాలయం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి):** రాఘవేంద్ర స్వామి గురు వైభవోత్సవాల్లో భాగంగా మార్చి 1న 404వ పట్టాభిషేకం మహోత్సవానికి ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పర్యటన ఖరారైంది. ఇందులో భాగంగా ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి, నియోజకవర్గ సీనియర్ నాయకులు రామకృష్ణారెడ్డి, రాకేష్ రెడ్డి, తహసీల్దార్ ఎస్.రవి, సీఐ రామాంజులు, హెలిప్యాడ్ మైదానం, పద్మనాభతీర్థ గెస్టు హౌస్‌లో వసతి, దర్శన ఏర్పాట్లను గురువారం పరిశీలించారు. ఉదయం 8 గంటలకు తాడేపల్లి నుంచి హెలిప్యాడ్ బయలుదేరి 8.30 గంటలకు మంత్రాలయం చేరుకుంటుంది. 9.55 గంటల నుంచి 11.30 గంటల వరకు రాఘవేంద్రస్వామి దర్శనం 2025-గురువైభవోత్సవాల అవార్డును నారా లోకేశ్‌కు పీఠాధిపతి ప్రధానం, 11.50గంటలకు మంత్రాలయం హెలిప్యాడ్‌కు బయలుదేరి 1.30 గంటలకు తాడేపల్లి నివాసానికి చేరుకుంటున్నట్లు ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అశోక్ రెడ్డి, ఎంపీటీసీ మేకల వెంకటేశ్, శివ, పోలి వీరేష్, మండల సర్వేయర్ అశోక్, కంసాలి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

### అప్రమత్తంగా ఉండండి : డీపీవో

**మంత్రాలయం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి):** మంత్రాలయంలో మార్చి1 ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పర్యటన ఉంటుందని, నాలుగు మండలాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని డీపీవో భాస్కర్ సూచించారు. గురువారం సాయంత్రం ఎంపీడీవో కార్యాలయంలో మంత్రాలయం నియోజకవర్గంలోని కౌతాళం, కోసిగి, పెద్దకడుబూరు, మంత్రాలయం స్పెషల్ ఆఫీసర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఈవోఆర్‌డీలు, ఎంఈవోలు ఆయా శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఏ అధికారి నిర్లక్ష్యం వహించినా చర్యలు తప్పవన్నారు. సమావేశంలో తహసీల్దార్‌లు ఎస్.రవి, రుద్రగౌడ, రజనీకాంత్ రెడ్డి, గీతా ప్రియదర్శిని ఎంపీడీవోలు శోభారాణి, సుబ్బరాజు, నాగరాజు స్వామి, ఎంఈవోలు మైనుద్దీన్, రాగన్న, శోభా రాణి, రామాంజనేయులు, రామ్మూర్తి, ఈవోఆర్‌డీలు ప్రభావతి దేవి, ఇతర మండలాల అధికారులు పాల్గొన్నారు.

### రేపటి నుంచి ఇంటర్ పరీక్షలు

**గోనెగండ్ల, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి):** ఇంటర్‌మీడియట్ పరీక్షలు శనివారం నుంచి ప్రారంభం అవుతున్నట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల సూపరింటెండెంట్ రవికుమార్ తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు 270 మంది, అలాగే ద్వితీయ సంవత్సరం 226 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు. మండలంలోని మోడల్‌స్కూల్, కేజీబీవీ పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు గోనెగండ్ల జూనియర్ కళాశాలను పరీక్ష కేంద్రంగా విద్యాశాఖ అధికారులు కేటాయించారన్నారు. విద్యార్థులు పరీక్ష కేంద్రానికి అరగంట ముందు చేరుకోవాలని సూచించారు.

### 'సీపీఎం నాయకుడిపై చర్యలు తీసుకోవాలి'

**పెద్దకడుబూరు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి):** అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న సీపీఎం నాయకుడు పరమేష్‌పై చర్యలు తీసుకోవాలని బాధితుడు బోయ నరసింహులు డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఎంతో మంది అమాయకులకు ఇంటి స్థలాల పట్టాలు ఇప్పిస్తానని నమ్మబలికి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేయడమేకాకుండా వారిపైనే దౌర్జన్యానికి పాల్పడుతున్నారన్నారు. ఫోర్జరీ సంతకాలతో చాలా మందికి పట్టాలు ఇచ్చాడని ఆరోపించారు. సీపీఎం నాయకుడు పరమేష్‌ను వెంటనే పోలీసులు అరెస్టు చేయాలని కోరారు.

### పోరాట ఫలితమే నిధుల మంజూరు

**ఎమ్మిగనూరు టౌన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి):** విద్యార్థి సంఘాలు సుదీర్ఘంగా చేసిన పోరాట ఫలితమే వసతి గృహాలకు నిధులు మంజూరు అయ్యాయని విద్యార్థి సంఘాల నాయకులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వలస ప్రాంతాలైన నాగలదిన్నె, నందవరం, ఎమ్మిగనూరు, గోనెగండ్ల మండలాలలోని విద్యార్థులు చదువుకు దూరం కాకుండా బడ్జెట్‌లో వసతి గృహాల భవనాలకు నిధులు మం జూరు చేయడం హర్షణీయమన్నారు. గత ప్రభుత్వంలో మంత్రులకు, ఎమ్మెల్యేలకు ఎన్నో వినతి పత్రాలు ఇచ్చిన ఉలుకు పలుకు లేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఎనిమిది నెలల్లో విద్యార్థుల భవిష్యత్తు గురించి ఆలోచించి పక్కా వసతి గృహాల భవనాలకు నిధులు మంజూరు చేసిందన్నారు.

### తిరుమల నగర్‌లో చోరీ

**ఎమ్మిగనూరు టౌన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) :** పట్టణ శివారులోని తిరుమల నగర్‌లో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. పట్టణ సీఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు .. పట్టణంలోని రాజశ్రీ ఫర్టిలైజర్ దుకాణం నిర్వహిస్తున్న బాలకృష్ణారెడ్డి తన భార్య పిల్లలతో ఈ నెల 25న ఉదయం శ్రీశైలానికి వెళ్లాడు. ఇదే అదును గా భావించిన దొంగలు ఇంట్లో చొరబడి 3.5తులాల బంగారం వస్తువులు ఎత్తుకె ళ్లారు. బాలకృష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు.

### నేడు కౌన్సిల్ సమావేశం

**ఎమ్మిగనూరు టౌన్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి):** పట్టణంలో మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11గంటలకు కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ గంగిరెడ్డి తెలిపారు. కౌన్సిల్ సభ్యులు అందరూ హాజరుకావాలని కోరారు.

# వైభవంగా రామలింగేశ్వరుడి రథోత్సవం

● ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి



ఎమ్మెల్యేను సత్కరిస్తున్న వేదపండితులు



రచ్చుమర్రిలో..



నందవరం మండలం గురజాలలో రథోత్సవానికి హాజరైన జనం



కౌతాళం మండలం రౌడూరులో..

**నందవరం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి):** సుప్రసిద్ధ శైవక్షేత్రమైన గురుజాలలో రామలింగేశ్వర స్వామి రథోత్సవం అశేష భక్త జనుల మధ్య గురువారం వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డిని ఆలయ నిర్వాహకులు, ఈవో రామ్‌ప్రసాద్, అర్చకులు హంపిస్వామి, వేదపండితులు టీడీపీ నాయకులు శివారెడ్డి సాదరంగా ఆహ్వానించి సన్మానించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే బీవీ హోమం కార్యక్రమం నిర్వహించారు. అనతరం అశేష జనవాహిని మధ్య రథోత్సవాన్ని నిర్వహించారు. ఉదయం నుంచే వేలాదిగా తరలివచ్చిన భక్తులు ఇసుకలింగాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. చట్టుపక్కల ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు పాల్గొని రథోత్సవాన్ని తిలకించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ ఉపేంద్రబాబు, సీఐ మధుసూదన్, ఎస్ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గురురాజారావు, రైస్‌మిల్ నారాయణరెడ్డి, కాశీంవలి, టీ ఈరన్న, జబ్బార్, వహాబ్, బ్రహ్మనందరెడ్డి, గజేంద్రరెడ్డి, తిప్పారెడ్డి, నలీం, వైసీపీ నాయకులు నరసింహారెడ్డి, జాన్ పాల్గొన్నారు.

**చంద్రమౌళీశ్వర స్వామి..**

**పెద్దకడుబూరు :** మండలంలోని దొడ్డిమేకల గ్రామంలో వెలసిన చంద్రమౌళీశ్వర స్వామి రథోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. రథోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామంలో చిన్నారులు చేసిన కోలాటాల ప్రదర్శన ఆకట్టుకుంది. స్వామివారికి ఉదయం నుంచి ఆలయ అర్చకులు, జలాభిషేకం, కుంకుమార్చన, పుష్పాభిషేకం, మహామంగళహారతి వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం చంద్రమౌళేశ్వరస్వామి రథాన్ని గ్రామస్థులు లాగారు. అలాగే పెద్దకడుబూరులో వెలసిన మల్లికార్జునస్వామి మహారథోత్సవాన్ని టీడీపీ రాష్ట్ర రైతు సంఘం అధికార ప్రతినిధి రమాకాంతరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.

**తిమ్మప్ప స్వామి..**

**మంత్రాలయం:** మండలంలోని రచ్చుమర్రి గ్రామంలో తిమ్మప్ప స్వామి మహారథోత్సవం వైభవంగా నిర్వహించారు. గురువారం తిమ్మప్ప దూత దేవాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం శివపార్వతుల కల్యాణం జరిపించారు. స్వామి వారిని పల్లకిలో ఏర్పాటు చేసి ఊరేగింపు చేసి అనంతరం రథోత్సవంపై శివపార్వతులు, శివలింగం చిత్రపటాలను అలంకరించి మహా ముఖద్వారం గుండా వీధుల్లో ఊరేగించారు. రథం ముందుకు సాగుతుండగా.. కోలాటం, నందికోల సేవ నృత్యాలు, తప్పెట్లు, డీజే, బాణాసంచా కాలుస్తూ ఓం నమశ్శివాయ అంటూ రథాన్ని ముందుకు కదిలించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ గోవిందమ్మ, సర్పంచ్ మేకల సుజాత ఎంపీటీసీలు మజ్జిగ నరసమ్మ, కోసిగి జయలక్ష్మి, నాయకులు జెట్టి నరసింహులు, యాగంటి వీరేష్, రోగెప్ప, మజ్జిగ బొజ్జప్ప, ఉప్పరి వెంకోబ, రవిరెడ్డి, జెట్టి వీరేష్, బుడ్డీర, మేకల నారాయణ, రామాంజనేయులు, గోవిందుగౌడు, పెద్ద ఎత్తున గ్రామ ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

**కౌతాళం:** మండల పరిధిలోని ఎరిగేరి గ్రామ పొలిమేరలో కొలువైన పులిగట్టు ఆంజనేయస్వామి దేవాలయంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. శివరాత్రి మరుసటి రోజున పులిగట్టు ఆంజనేయస్వామికి, రౌడూరు గ్రామంలోని జట్టేప్ప తాతకు ప్రత్యేక పూజల చేశారు. ఎరిగేరిలో గ్రామ ఆటో డ్రైవర్ల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. భక్తులు కొండ దిగువన స్వామి వారికి తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం రౌడూరులో స్వామి వారి రథాన్ని లాగారు. సీఐ అశోక్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

**కమనీయం.. పార్వతీ పరమేశ్వరుల కల్యాణం**

**గోనెగండ్ల:** మండల కేంద్రమైన గోనెగండ్లలో గురువారం సాయంత్రం గ్రామ శివార్లలో ఉన్న కాశీ విశ్వేశ్వరస్వామి దేవాయలంలో పార్వతి పరమేశ్వరుల కల్యాణం నిర్వహించారు. స్వామివారిని, అమ్మవారిని ప్రత్యేక పూలతో అలంకరించారు. అనంతరం రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించారు. అమ్మవారికి కుంకుమార్చన, ఆకుపూజ, మహా మంగళహారతి ఇచ్చారు. అనంతరం సాయంత్రం 7గంటల సమయంలో పార్వతి పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఈశ్వరదేవాలయం నుంచి ఆంజనేయస్వామి దేవాలయం వరకు చిన్నారు పూర్ణ కలశాలతో ఊరేగించారు. అనంతరం అన్నతర్పణ కార్యక్రమం చేపట్టారు. రాత్రి భజన కార్యక్రమం నిర్వహించారు.

**ఎమ్మిగనూరు రూరల్:** మండలంలోని గుడికల్లు గ్రామంలో వెలసిన భ్రమరాంబ మల్లికార్జునస్వామి వార్ల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి పండితులు కల్యాణాన్ని జరిపించారు. ఈ సందర్భంగా చిన్నారులు కలశాలతో స్వామి, అమ్మవార్లకు హారతి ఇచ్చారు. అనంతరం చిన్నారులు చేసిన కోలాటాల నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి.



పెద్దకడుబూరు మండలం దొడ్డిమేకలలో..



కలశాలతో చిన్నారులు



కోలాటం ఆడుతున్న చిన్నారులు

# మంత్రాలయంలో పోటెత్తిన భక్తులు

**మంత్రాలయం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి):** ప్రముఖ పుణ్యక్షేత్రమైన మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం భక్తులు పోటెత్తారు. గురువారం రాఘవేంద్రస్వామి సజీవ సమాధి పొందిన శుభదినం కావటంతో వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖద్వారం, మధ్వమార్గ్ కారిడార్, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, నదితీరం భక్తులతో కోలాహలంగా మారింది. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

**రజిత గజ వాహనంపై ప్రహ్లాదరాయలు:** రాఘవేంద్రస్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు వెండి గజవాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. గురువారం మాఘశుద్ధ చతుర్దశిను పురస్కరించుకుని పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి, మంచాలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రజిత గజవాహనంపై స్వర్ణ అంబారిలో వజ్రాలు పొదిగిన ప్రహ్లాదరాయలను అధిష్ఠించి పీఠాధిపతి మహామంగళహారతితో ఇవ్వగా, ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు.



మఠం ప్రాంగణంలో కిక్కిరిసిన భక్తులు

# కర్ణాటక మద్యం స్వాధీనం

కారు సీజ్, వ్యక్తి అరెస్టు, మరొకరు పరారు

**మంత్రాలయం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి):** మంత్రాలయం సమీపంలో కర్ణాటక నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని పట్టుకున్నట్లు మంత్రాలయం సీఐ రామాంజులు తెలిపారు. గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ కోడుమూరు మండలం వెంకటగిరి గ్రామానికి చెందిన దూదేకుల షేక్షావలి డ్రైవర్, ప్యాలకుర్తికి చెందిన ఈడిగ విజయకుమార్ గౌడు కర్ణాటక నుంచి 34 బాక్సుల్లోని 3,264 కర్ణాటక టెట్రా ప్యాకెట్లను కారులో తీసుకువస్తున్నారు. రహస్యంగా వచ్చిన సమాచారం మేరకు గ్రామ శివారులో వాహనాలు తనిఖీ చేస్తుండగా.. ఈడిగ విజయకుమార్‌గౌడు కారులో దిగి పరారయ్యాడు. డ్రైవర్ దూదేకుల షేక్షావలిని అదుపులోకి తీసుకుని విచారించగా.. కారులో ఉన్న 34 బాక్సుల్లోని దాదాపు రూ. 3 లక్షలు విలువ చేసే 3,264 మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కారును సీజ్ చేసి, డ్రైవర్‌ను అరెస్టు చేసి ఎమ్మిగనూరు కోర్టులో హాజరుపరచగా.. రిమాండ్‌కు తరలించారన్నారు. ఈడిగ విజయకుమార్‌గౌడు పరారీలో ఉన్నాడని, త్వరలో అరెస్టు చేస్తామన్నారు. తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ, లక్ష్మన్నగౌడు, జమీర్ పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న మద్యంతో పోలీసులు

### రాయితీ రుణాలకు ఇంటర్వ్యూలు

**మంత్రాలయం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి):** మండలంలో 73 యూనిట్లకు 325 మంది హాజరైనట్లు ఎంపీడీవో శోభారాణి, ఈవోఆర్‌డీ ప్రభావతి దేవి తెలిపారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో రాయితీ రుణాలకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా అభ్యర్థుల ధ్రువపత్రాలు పరిశీలించారు. సమావేశంలో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజర్ ఆర్. సత్యజయకృష్ణ, ఫీల్డ్ ఆఫీసర్ వెంకట్, కెనరా బ్యాంకు మేనేజర్ నాగార్జున, మనోహర్, ఉరుకుందు, తుంగభద్ర ఏపీజీబీ ఫీల్డ్ ఆఫీసర్ మురళి, ఎస్‌బీఐ ఫీల్డ్ ఆఫీసర్ రామచంద్రనాయక్, రవి, బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్ మురళికృష్ణ, కిరణ్, శేఖర్, రవి, గ్రామ కార్యదర్శులు వేణుగోపాల్, నాగరాజు, మహేష్, స్వామినాథన్ పాల్గొన్నారు.

### బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

**మంత్రాలయం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి):** టీడీపీ నాయకులకు, కార్యకర్తలకు ఎటువంటి ఆపద, కష్టం వచ్చినా మాధవరం రామిరెడ్డి కుటుంబం అండగా ఉండి అన్ని విధాలుగా ఆదుకుంటుందని టీడీపీ సీనియర్ నాయకుడు రఘునాథ్‌రెడ్డి అన్నారు. మంత్రాలయం రామచంద్రనగర్‌కు చెందిన టీడీపీ సీనియర్ నాయకులు మర్రి పోలు (68) అనారోగ్యంతో గురువారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న మంత్రాలయం టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి రాఘవేంద్ర రెడ్డి సోదరుడు మాజీ సర్పంచ్ రఘునాథ్‌రెడ్డి మృతదేహానికి నివాళి అర్పించారు. బాధిత కుటుంబాన్ని ఓదార్చి ధైర్యంగా ఉండాలని సూచించారు. మట్టి ఖర్చులకు నగదును అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆశోక్‌రెడ్డి, శివ, నరసింహులు, కంసలి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

### ఇష్టంతో చదవాలి

**గోనెగండ్ల, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి):** ఇష్టంతో చదివితే తప్పక ఫలితం ఉంటుందని కేజీబీవీ పాఠశాల ప్రిన్సిపాల్ విద్యావతి అన్నారు. గురువారం గోనెగండ్లలోని కేజీబీవీ పాఠశాలలో సరస్వతి పూజ చేశారు. సీఆర్‌పీఎఫ్ జిల్లా కన్వీనర్ లింగన్న ముఖ్య అతిథిగా హాజర య్యారు. అనంతరం పదవ తరగతి, ఇంటర్ మీడియట్ విద్యార్థులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి బాగా చదివి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

### నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలి

కేజీబీఎస్ మండల ప్రధాన కార్యదర్శి రాజా రమేష్



మాట్లాడుతున్న రాజా రమేష్

**ఎమ్మిగనూరు టౌన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) :** కాటికాపరులను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని కేజీబీఎస్ మండల నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో కేజీబీఎస్ మండల ప్రధాన కార్యదర్శి రాజా రమేష్ మాట్లాడుతూ కాటికాపరులను ప్రభుత్వం గుర్తించి గుర్తింపు కార్డులు ఇచ్చి, వృత్తి పరికరాలను ఇవ్వాలని, బీమా సౌకర్యం కల్పించాలన్నారు. అదేవిధంగా వయస్సు నిండిన వారికి రూ. 8000 పింఛన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. శ్మశానాలు కబ్జాకు గురికాకుండా కాపాడాలన్నారు. కాటికాపర్ల సమస్యలపై మార్చి 11న చలో విజయ వాడను నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో కేవీపీఎస్ నాయకులు తిమ్మన్న, చర్మకళాకారుల సంఘం నాయకులు సుమాల ఆంథోని, గుంటేప్ప, వినోద్ పాల్గొన్నారు.



# టీడీపీతోనే గ్రామాభివృద్ధి



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

**గోనెగండ్ల, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి):** టీడీపీ పాలనలోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని తెలుగుయువత మండల అధ్యక్షుడు రంగస్వామినాయుడు, సందీప్‌నాయుడు అన్నారు. గురువారం వేముగోడు గ్రామంలో టీడీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామంలో రూ. 65 లక్షలతో సీసీరోడ్లు, డ్రైనేజీ పనులు చేశారన్నారు. గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించేందుకు రూ. 27లక్షలతో ఓహెచ్ఆర్ ట్యాంక్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అలాగే పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వినోద్ కుమార్ గౌడ్, పెద్దయ్య, నరసింహులు, అంపయ్య, గోపాల్, పాండు,అంపన్న, హరికృష్ణ, శంకర్, రంగన్న, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలి




ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు

**నందవరం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి):** పెండింగ్ ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం రైతు సంఘం ఆధ్వర్యంలో నందవరం బస్టాండ్ దగ్గర ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ వ్యవసాయ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్నగౌడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న బడ్జెట్‌లో పశ్చిమ ప్రాంతాలైన ఆర్డీఎస్ ప్రాజెక్టును పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అలాగే వేదవతి, గుండ్రేవులు ప్రాజెక్టులకు నిధులు కేటాయించి త్వరగా పూర్తి చేయాలని ఆయన కోరారు. గురురాఘవేంద్ర ప్రాజెక్టు కింద పొలాలకు సాగు నీరు అందించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి గిడ్డయ్య, దేవరాజ్, దస్తగిరి, పకీర్‌సాబ్, ముని, హనుమంతు పాల్గొన్నారు.